RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



4 లో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి


**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :208 సంపాదకులు: కలిచేటి వెంకయ్య గురువారం 25 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad











# రాష్ట్రంలో సువర్ణాధ్యాయం ప్రారంభం

ఏపీలో పండని పంటలు లేవు... దొరకని ఖనిజాలు లేవు

సీమకు పునర్ వైభవం... చరిత్ర పునరావృతం

సీమకు గ్రోత్ ఇంజన్‌గా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్

జొన్నగిరి ఇకపై స్వర్ణగిరి

ఆభరణాల తయారీకి జ్యుయలరీ పార్క్ ఏర్పాటు చేస్తాం

జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో సీఎం చంద్రబాబు

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సహకరించేలా జొన్నగిరి బంగారాన్ని స్థానిక వ్యాపారులకే విక్రయిస్తామన్న గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ యాజమాన్యం

**జొన్నగిరి, సింధూరదర్శిని:** రాష్ట్రంలో సువర్ణాధ్యాయం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. జొన్నగిరి గోల్డ్ ఫీల్డులో బంగారం వెలికితీతతో సీమకు పునర్ వైభవం రానుందని అన్నారు. బుధవారం సీఎం చంద్రబాబు కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరిలో పర్యటించారు. జొన్నగిరి గోల్డ్ ఫీల్డులో జియో మైసూర్ - డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు ఏర్పాటు చేసిన గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బంగారం శుద్ధి కోసం బంగారు ఖనిజంతో కూడిన మట్టిన తీసుకెళ్లే భారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో భారీ వాహనాలు నడిపేలా సిమ్యులేటర్ యంత్రాలపై మహిళలకు, యువతకు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని సీఎం సందర్శించారు. రూ.405కోట్ల పెట్టుబడితో జొన్నగిరిలో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు బంగారాన్ని మైనింగ్ చేసి, ప్రాసెస్ చేసి విక్రయించనున్నారు. జొన్నగిరి గోల్డ్ ఫీల్డులో తొలి ఏడాది 400 కేజీలతో మైనింగ్ ప్రారంభించి తదుపరి దశలో 900కేజీలు, అనంతరం 2టన్నుల వరకూ మిగతా 2లో...



## మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సేవలో పవన్‌కళ్యాణ్

**మంగళగిరి, సింధూరదర్శిని:** శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ బుధవారం ఉదయం దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ ఎగువన కొలువైన శ్రీపానకాల లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. పానకాల స్వామి వారికి పట్టువస్త్రాలతో పాటు పానకం నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, స్వామివారి తీర్థప్రసా దాలు అందజేశారు. అంతకు ముందు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేసిన పవన్ కళ్యాణ్‌కి ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు మంగళవాద్యాలతో స్వాగతం పలికారు.

## సమాజంలో మార్పు తెచ్చేందుకే విద్యాశాఖను ఎంచుకున్నా!

సమాజంలో మార్పు తెచ్చేందుకే విద్యాశాఖను ఎంచుకున్నా!

అంతా కలిసి ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ సాధిద్దాం

సంస్కరణలు పూర్తయ్యాయి, ఇక బోధనపైనే టీచర్లు శ్రద్ధ వహించాలి

విద్యార్థులు చదవకపోతే ముఖ్యమంత్రి నాకు మైనస్ మార్కులు వేస్తారు

మోపిదేవి హైస్కూలు నూతన భవనాల ప్రారంభోత్సవంలో విద్యా శాఖ మంత్రి లోకేష్

**కొక్కిలిగడ్డ, సింధూరదర్శిని:** సమాజంలో మార్పు తెచ్చేందుకే నేను అత్యంత కఠినమైన విద్యాశాఖను ఎంచుకున్నాను. దీనిని నేను ఛాలెంజ్ గా స్వీకరించాను. విద్యావ్యవస్థలో మార్పు తేవడం ఉపాధ్యాయుల సహకారంతోనే సాధ్యమవుతుంది. దేశంలోనే ఆదర్శవంతంగా ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తీసుకురావాలన్నది నా ధ్యేయం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర మానవ వనరులు,ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టిజిఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అవనిగడ్డ మిగతా 2లో...



## సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం దుష్ప్రచారాన్ని నమ్మవద్దు

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**అమరావతి, సింధూరదర్శిని:** సాయిబాబా ఆలయాల విషయంలో నేను చేసిన వ్యాఖ్యలను కొంతమంది వక్రీకరించి, సాయిబాబా భక్తుల మనోభావాల ను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం. నా వ్యాఖ్యల ఉద్దేశాన్ని పూర్తిగా పక్కనబెట్టి కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నేను ఖండిస్తున్నాను. ముందుగా ఒక విషయం చాలా స్పష్టంగా చెబుతున్నాను. నేను వ్యక్తిగతంగా సాయిబాబా భక్తుడిని. ప్రతిరోజూ ఉదయం నా పూజా మందిరంలో వివిధ దేవతామూర్తులతో పాటు గురుపీఠంపై కొలువై ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా స్వామి వారిని భక్తిశ్రద్ధలతో పూజించిన తర్వాతే నా దినచర్యను ప్రారంభిస్తాను. సాయిబాబా పట్ల నాకు అత్యంత గౌరవం, భక్తి ఉన్నాయి. నా వ్యాఖ్యల వల్ల మిగతా 2లో...

# బీసీలను అగ్రపథాన నిలబెడతాం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

బీసీ సంక్షేమానికి చరిత్ర ఎరుగని నిధులను కేటాయించాం

స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లకు కృషి

గురుకులాలతో బీసీలకు అత్యున్నత విద్య

రూ.500 కోట్లతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు

కొత్తగా మరో 10 ఎంజేపీల ఏర్పాటు

విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిలో ప్రత్యేక బీసీ స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు నిర్ణయం

ఈ సర్కిళ్ల ద్వారా గ్రూప్ 1, గ్రూప్ 2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందజేస్తాం

కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుకు జగన్ కుట్రలు : మంత్రి సవిత



**అమరావతి, సింధూరదర్శిని:** సమాజంలో సగానికిపైగా ఉన్న బీసీలను రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అగ్రపథాన నిలపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించబోతున్నామని, కొత్తగా మరో 10 బీసీ గురుకులాలను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. బీసీ విద్యార్థులకు ఐఐటీ, నీట్‌లో ప్రవేశానికి శిక్షణ పొందేలా రెండు ఎక్స్ లెన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకాన్ని అమలు చేయబోతున్నామని, ఈ పథకం ద్వారా ఆధునిక పరికరాలు అందజేసి, బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇస్తున్నామని, దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీలకు ఆత్మగౌరవాన్ని నిలిపేలా చట్టాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖలో రెండేళ్ల ప్రగతిపై బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మిగతా 2లో...

## 'ఎస్ఐఆర్'పై సీఎం రేవంత్ ఫోకస్.. నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్!

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్‌నేతలకు సీఎం రేవంత్ హెచ్చరిక

నిర్లక్ష్యం చేస్తే ఇన్‌చార్జిల మార్పు తప్పదని స్పష్టం

పది రోజుల పాటు నేతల పనితీరుపై నిఘా

పేదల ఓటు హక్కులను కాపాడాలని పిలుపు



**హైదరాబాద్, సింధూరదర్శిని:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్‌పై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాల మిగతా 2లో...

## సమాజంలో మార్పు తెచ్చేందుకే విద్యాశాఖను ఎంచుకున్నా!

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో పి4 పథకంలో భాగంగా దాతల సహకారంతో రూ.1.4కోట్లతో నూతనంగా నిర్మించిన జెడ్పీ హైస్కూలు నూతన భవనాలను బుధవారం ఉదయం మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ కొక్కిలిగడ్డ హైస్కూలు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ... గత రెండేళ్లలో విద్యావ్యవస్థలో సంస్కరణలన్నీ పూర్తిచేశాం, ఇక ఉపాధ్యాయులంతా పూర్తిగా ఫలితాలపైనే శ్రద్ధ వహించాలని సూచించారు. నేను విద్యా మంత్రిగా బాధ్యతలు చేపట్టాక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పర్చాం. రాష్ట్రవ్యాప్తంగా హార్డ్ వేర్ (ఇన్‌ఫ్రా) మెరుగైంది, సాఫ్ట్ వేర్ (లెర్నింగ్ అవుట్ కమ్స్) మెరుగు పర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. కొక్కిలిగడ్డ హైస్కూలులో లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ తప్ప అన్ని సౌకర్యాలు కల్పించాం. అభ్యసనా ఫలితాల మెరుగుదలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహిం చాలి. ఫార్మేటివ్, సమ్మేటివ్ టెస్ట్ ఫలితాల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగు పర్చాలి. వెనుకబడిన విద్యార్థుల పనితీరును మెరుగుపర్చేందుకు బ్రిడ్జి కోర్సు మెటీరియల్‌ను అందజేస్తాం. వివిధ తరగతుల్లో వెనుకబడిన పిల్లలు ఏ సబ్జెక్టుల్లో బలహీనంగా ఉన్నారో తెలుసుకొని, అటువంటి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి. నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు.

**తొలిసారిగా ప్రభుత్వ స్కూళ్ల ఫలితాలతో యాడ్స్**

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల చిత్రాలతో పత్రికల్లో యాడ్స్ ఇచ్చామని మంత్రి లోకేష్ చెప్పారు. గత విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తూ వస్తున్నాం. టీచర్లు ఇక పూర్తిస్థాయిలో బోధనపైనే శ్రద్ధ వహించాలి. ఉపాధ్యాయులు తమ రోజువారీ విధినిర్వహణలో ఏదైనా సమస్య తలెత్తితే మీరు ఎంఇఓ, డిఇఓలకు వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు, లీప్ యాప్ ద్వారా నేరుగా నాకు చెప్పొచ్చు. వచ్చేనెల 16,17,18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పేరెంట్ -- టీచర్ మీటింగ్ సమావేశాలను నిర్వహించాలని భావిస్తున్నాం. ఉపాధ్యాయులంతా చొరవ తీసుకొని తల్లిదండ్రులను చైతన్యపర్చి లీప్ యాప్ డౌన్ లోడ్ చేయించండి. విద్యావ్యవస్థలో నేను అనుకున్నది సాధించాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారుల సహకారం అవసరం. అందరి సమిష్టికృషితోనే అత్యుత్తమ ఫలితాలు రాబట్టగలుగుతాం. అందరం టీమ్ వర్క్ గా పనిచేసి ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సాధిద్దాం. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ... ప్రభుత్వం అమలుచేసిన వందరోజుల కార్యాచరణ ప్రణాళిక, జిఎఫ్ఎల్ఎన్ ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల్లో యాడ్స్ ఇవ్వడం ప్రోత్సాహకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ స్పందిస్తూ దీర్ఘకాలంలో 100 డేస్ యాక్షన్ ప్లాన్ అవసరం లేనివిధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. పదోతరగతిలో బాలికలు ఫెయిలైతే వారు సామాజిక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది, ఈ అంశాన్ని కూడా ఉపాధ్యాయులు గుర్తుంచుకోవాలన్నారు. గత ఏడాది మెగా డిఎస్సీ ద్వారా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ మనీష మాట్లాడుతూ... కేవలం 155 రోజుల్లో డిఎస్సీని పారదర్శకంగా పూర్తిచేసి, నాలాంటి వేలాదిమంది టీచర్ల కల నెరవేర్చారంటూ మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. హిందీ టీచర్ అనిత మాట్లాడుతూ... కొక్కిలిగడ్డ హైస్కూలులో ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన వర్క్ బుక్స్ ఫలితాలను మెరుగుపర్చేందుకు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. మరో టీచర్ షర్మిల మాట్లాడుతూ... కొక్కిలిగడ్డ స్కూలులో సౌకర్యాల మెరుగుతో ఈ ఏడాది కొత్తగా 39మంది విద్యార్థులు చేరారని, వారంతా ప్రైవేటు కాన్వెంట్ల నుంచే వచ్చారని చెప్పారు. ఇందుకు కృషిచేసిన టీచర్లను మంత్రి లోకేష్ అభినందించారు. తమ స్కూలులో పాల్ ల్యాబ్ ఒక్కటి ఏర్పాటు చేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని టీచర్ షర్మిల తెలుపగా, త్వరలోనే ఆ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. త్వరలో క్లిక్కర్ టెక్నాలజీ కూడా అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు.

**మీరు చదవకపోతే నాకు మైనస్ మార్కులు!**

విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధిస్తే ముఖ్యమంత్రిగారు నాకు మంచి మార్కులు వేస్తారు, మీరు సరిగా చదవకపోతే ఆయన నాకు మైనస్ మార్కులు వేస్తారు, నా భవిష్యత్తు మీపై ఆధారపడి ఉందని మంత్రి లోకేష్ చమత్కరించారు. మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో పి4 పథకంలో భాగంగా దాతల సహకారంతో రూ.1.4కోట్లతో నూతనంగా నిర్మించిన జడ్ పి హైస్కూలు నూతన భవనాలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 9, 10 తరగతుల విద్యార్థులతో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మీ సౌకర్యం, మీ భవిష్యత్తు కోసం దాతలు అద్భుతంగా కొత్త భవనాలను నిర్మించారు. విద్యార్థులంతా కష్టపడి చదివి పాస్ పర్సంటేజిని పెంచాలి. ఇప్పటికే విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు ఇచ్చాం, త్వరలోనే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్స్, బూట్లు అందజేస్తాం. విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచిమార్కులతో మెరుగైన ఫలితాలు సాధించాలి. విద్యార్థుల పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు లీప్ యాప్ ను రూపొందించాం. ఆయా సబ్జెక్టులకు సంబంధించి కంటెంట్ వీడియోలను తయారుచేశాం. లీప్ యాప్ ను విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్లలో డౌన్ లోడ్ చేసుకొని, తమబిడ్డల అభ్యసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.

## ‘ఎస్ఐఆర్’పై సీఎం రేవంత్ ఫోకస్.. నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే పది రోజుల పాటు నేతల పనితీరును పరిశీలిస్తామని, అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. గ్రామీణ స్థాయిలో అవగాహన పెంచడంలో సర్పంచ్‌లు కూడా చురుగ్గా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశం చాలా సున్నితమైనదని, కొందరు నాయకులు దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా వారీగా నివేదికలు తనకు అందాయని, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం గురువారం నుంచి ఇంటింటి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నాయి.

# రాష్ట్రంలో సువర్ణాధ్యాయం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

బంగారాన్ని ఉత్పత్తి చేసే ప్రాజెక్టును సీఎం ప్రారంభించారు. జియో మైసూర్ – డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు జొన్నగిరిలో తవ్వకాలు జరిపి ముడి ఖనిజం నుంచి బంగారం ఉత్పత్తి చేసే ప్రక్రియను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఉత్పత్తి యూనిట్లోని వేర్వేరు విభాగాలను పరిశీలించారు. బంగారు బిస్కట్లు సహా వివిధ రూపాల్లోని తుది ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ నుంచి తుది ఉత్పత్తి వరకూ జరిగే ప్రక్రియలను జియో మైసూర్ సంస్థ చైర్మన్ ప్రభాకరన్, ఎండీ నవీన్ లాల్ చంద్ర సీఎం చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం మొదలైంది. ఈ సువర్ణ అధ్యాయానికి రతనాల సీమ రాయలసీమ కేంద్రమైంది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును లాంఛ్ చేయడం శుభపరిణామం. విస్తరణ యూనిట్ కు శంకుస్థాపన చేసుకున్నాం. ఈ ప్రాజెక్ట్ చేపట్టిన సంస్థల యాజమాన్యాలకు, ఉద్యోగులకు, కార్మికులకు అభినందనలు. జొన్నగిరి ఘనత నేటిది కాదు. ఈ ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ ప్రాంతాన్ని సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి కాలంలో ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా ఉన్న సువర్ణగిరే ఈనాటి జొన్నగిరి. వందల సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. ఇక్కడకు దగ్గరలో లభించిన అశోకుడి ఎర్రగుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చెబుతున్నాయి. రాయలసీమ అంటేనే రతనాల సీమ. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో సీమలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారు. ప్రపంచానికి కోహినూర్ వజ్రాన్ని అందించిన ఘనత మన రాష్ట్రానిదే. కాలక్రమేణా రాయలసీమ ఎడారిగా మారే పరిస్థితులు తలెత్తాయి. ప్రాజెక్టులు పూర్తి చేసి, సాగునీరు ఇచ్చి సీమకు మళ్లీ జీవం పోశాం. గోల్డ్ మైనింగ్ తో సీమకు పూర్వ వైభవం వస్తుంది. ఈ ప్రాంతానికి జొన్నగిరి బదులు స్వర్ణగిరి అని పేరు పెట్టుకుందాం. 2047కు దేశాన్ని వికసిత్ భారత్ గా తయారు చేయాలన్నది ప్రధాని మోదీ కల. మన రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తయారు చేయాలన్నది నా ఆశయం."అని ముఖ్యమంత్రి చెప్పారు.



**ఏపీ అంటే రత్నగర్భ**

"ఇక్కడ గోల్డ్ మైన్ వచ్చింది. ఇక్కడి ప్రజల జీవితాలు స్వర్ణమయం కావాలి, ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని స్వర్ణగిరి మోడల్ విలేజ్ గా అభివృద్ధి చేస్తారు. రాయలసీమను రతనాల సీమగా తయారు చేస్తామని చెప్పిన మాటను నెరవేర్చుకుంటున్నాం. స్వర్ణగిరి గ్రామం నుంచే ఈ ప్రణాళిక ప్రారంభం అయ్యింది. ఇక దేశమంతా స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్ గురించే మాట్లాడుతుంది. దేశం ఇప్పుడు 800 కిలోల బంగారాన్ని దిగుమతి చేసుకుంటోంది. చమురు తర్వాత ఇదే అతిపెద్ద దిగుమతి. బంగారం అంటే మనందరికీ ఎంతో మమకారం. బంగారం ఉంటే మనకు గౌరవంగా భావిస్తాం. తొలి ఏడాది 400 కిలోలు నుంచి ప్రారంభించి 50 మెట్రిక్ టన్నుల బంగారం ఉత్పత్తికి చేరుకుంటాం. ఏటా ఉత్పత్తి అయ్యే బంగారంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మొత్తంలో కొంత మేరైనా తగ్గుతుంది. దీంతో విదేశీ మారక నిల్వల్ని కొంత కాపాడుకోవచ్చు. స్థానిక యువతకు కూడా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కూడా వస్తాయి. ఈ గోల్డ్ మైన్ ప్రాజెక్ట్ ఈ ప్రాంత అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజిన్ అవుతుంది. బంగారం ఎక్కడికో తరలించి ఆభరణాలు తయారు చేసే బదులు ఇక్కడే ఓ జ్యుయలరీ పార్కు కూడా ఏర్పాటు చేస్తాం. ఈ పరిశ్రమకు అనుమతులు, భద్రత కూడా కల్పిస్తాం. స్వర్ణగిరి నుంచి ఎయిర్ పోర్టుకు హెలికాప్టర్ ద్వారా బంగారం తరలించే ప్రాజెక్టు చేపడతాం. ఆంధ్రప్రదేశ్ అంటే అన్నపూర్ణ మాత్రమే కాదు...ఆంధ్రప్రదేశ్ అంటే రత్నగర్భ. మన రాష్ట్రంలో పండని పంటలు లేవు... దొరకని ఖనిజాలు లేవు. మంగంపేట బెరైటీస్, కడప లైమ్ స్టోన్, యురేనియం, విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ ఉంది. చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్, కుప్పంలో గ్రీన్ గ్రానైట్, శ్రీకాకుళంలో బ్లూ గ్రానైట్. గూడూరు మైకా, నెల్లూరు సిలికా, ఉత్తరాంధ్ర తీరంలో బీచ్ శాండ్. అనంతపురం, కడపలో ఐరన్ ఓర్.... కేజీ బేసిన్ లో గ్యాస్, పెట్రోల్ లభ్యమవుతాయి. ఈ వనరులను సద్వినియోగం చేసుకునేలా వాల్యూ ఎడిషన్ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాం. సిమెంటు, స్టీల్ పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయి. ఈ గనులు, వచ్చే పరిశ్రమలతో ఇక్కడి యువతకు ఇక్కడే ఉపాధి కల్పిస్తాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు ఏపీ ఓ మోడల్. గత పాలకులు అక్రమ సంపాదన కోసం పరిశ్రమల్ని బయటకు తరిమేశారు. కేవలం ఎన్డీఏ ప్రభుత్వ బ్రాండ్ తోనే పారిశ్రామిక వేత్తలు ఏపీకి క్యూ కడుతున్నారు. సీమలో ప్రతి జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం. స్పేస్, ఏరో స్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, స్టీల్, సిమెంట్, క్లీన్ ఎనర్జీ రంగాల్లో భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. కర్నూలు జిల్లాలో దేశంలో అతిపెద్ద డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను తీసుకువస్తాం. అనంతపురంలో నాడు కియా తెచ్చాం. నేడు 5వ్ జనరేషన్ ఫైటర్ జెట్ల ప్రాజెక్టు తెచ్చాం. 2028 ఉత్పత్తి లక్ష్యంగా కడప జిల్లాలో జూలై 3న రాయలసీమ స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన చేస్తున్నాం. కొప్పర్తి ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి చేస్తున్నాం. తిరుపతిలో రాయల్ ఎన్ ఫీల్డ్ పరిశ్రమ తీసుకువచ్చాం. నేను రాయలసీమ బిడ్డను. రాయలసీమను రతనాల సీమగా చేస్తాం. స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్ నుంచి కొత్త చరిత్ర మొదలైంది... ఇక స్వర్ణ మయమే. అంతా కలిసి స్వర్ణాంధ్ర విజన్ 2047 కలను నిజం చేసుకుందాం."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**సీమకు సాగునీరిచ్చాం**

"రాయలసీమకు నీరిచ్చి ముఖ చిత్రాన్ని మార్చింది కూడా మా ప్రభుత్వమే. కేవలం రెండేళ్లలో సీమలో సాగునీటి ప్రాజెక్టులకు ఏకంగా రూ.12,484 కోట్లు ఖర్చు చేశాం. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీ నీవా, ఌజ, ౡజ, ఖజ జూౘీౘా, ౕ=దీజ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి సీమ గతిని మార్చాం. రాయలసీమను పూర్వోదయ ప్రాజెక్టు కింద రూ.40 వేల కోట్లతో హార్టికల్చర్ హబ్ గా చేసే ప్రణాళికలు రూపొందించాం. హంద్రీ నీవా కాలువల వెడల్పు పూర్తి చేసి రిజర్వాయర్లు, చెరువులు నింపాం. తిరుపతి, శ్రీశైలం, ఒంటిమిట్ట వంటి పుణ్యక్షేత్రాల పవిత్రతను కాపాడుతున్నాం. టెంపుల్ టూరిజంతో పాటు... గండికోట వంటి ప్రాంతాలను ప్రసిద్ధ పర్యాటక కేంద్రాలుగా చేస్తున్నాం. వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి కేంద్ర సాయంతో ఆక్సిజన్ ఇచ్చి... వ్యవస్థలను గాడిన పెడుతున్నాం. ఏపీని అగ్రస్థానంలో నిలపాలన్న సంకల్పంతోనే కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. అన్నదాత సుఖీభవ కింద 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేల చొప్పున డబ్బులు వేశాం.

ప్రతీ నెలా మొదటి తారీఖున పేదలకు, వృద్ధులకు పెన్షన్ అందిస్తున్నాం. వచ్చే నెలలోనే తల్లికి వందనం కింద పిల్లలందరికీ నిధులు జమ చేస్తాం. హామీ ఇవ్వక పోయినా 10,800 మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి పాత పెన్షన్ స్కీంకు తీసుకువచ్చాం. ఈ నిర్ణయం వల్ల ఒక్కొక్కరికీ గరిష్టంగా రూ.3 కోట్ల వరకూ ప్రయోజనం కలుగుతుంది. ప్రభుత్వానికి భారమైనా... ఉద్యోగులకు మేలు చేయాలనే భావనతో ఈ నిర్ణయాలు తీసుకున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

## బీసీలను అగ్రపథాన నిలబెడతాం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి సవిత మాట్లాడారు. బీసీలు సమాజానికి బ్యాక్ బోన్లు అని సీఎం చంద్రబాబు నమ్మారన్నారు. సమాజంలో సగానికిపైగా ఉన్న బీసీల అభ్యున్నతే లక్ష్యంగా అనేక పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ లో రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్ లో రూ.47 వేల కోట్లు, మూడో బడ్జెట్ లో రూ.51 వేల కోట్లు కేటాయించామన్నారు. ఇంత పెద్ద ఎత్తున నిధులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ కేటాయించలేదన్నారు. ఇదీ బీసీల సంక్షేమం పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకు, కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

**గురుకులాలతో బీసీలకు అత్యున్నత విద్య**

ప్రస్తుతం రాష్ట్రంలో 109 బీసీ గురుకులాలు ఉన్నాయని, కొత్తగా మరో 10గురుకులాలను ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. రూ.500కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. బడి బయట బీసీ బిడ్డలు ఉండకూడదన్న లక్ష్యంతో నూతన ఎంజేపీలు ఏర్పాటు చేయడమేకాకుండా, పదో తరగతి తరవాత డ్రా పౌట్లను నిరోధించడానికి ఆరు బాలిక గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే పది గురుకుల పాఠశాలలో అయిదు వేల మంది విద్యార్థులకు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. అప్ గ్రేడ్ చేస్తున్న ఆరు జూనియర్ కళాశాలల్లో 960 మంది విద్యార్థినులకు ఉన్నత చదువులు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. బీసీ బిడ్డలకు నీట్, ఐఐటీలో శిక్షణ కోసం టేకులోడు(శ్రీసత్యసాయి), సింహాచలం(విశాఖ) ఎంజేపీ గురుకులాల్లో రెండు ఎక్స్ లెన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతేడాది ట్రిపుల్ ఐటీకి 302 మంది బీసీ గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది 275 మంది ఎంపికయ్యారని, ఇంకా కౌన్సెలింగ్ జరుగుతోందని, మరింత మంది ఎంపికయ్యే అవకాశముందని మంత్రి సవిత ఆశాభావం వ్యక్తంచేశారు. 2014-19లో మంజూరు చేసిన గుడిబండ, గుండుమల, పులివెందుల, రొద్దం బీసీ గురుకులాలను తరవాత వచ్చిన జగన్ పక్కనపెట్టేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.30 కోట్లతో ఆయా గురుకులాల నిర్మాణాలు పూర్తిచేశామని, త్వరలోనే ఈ గురుకులాలను ప్రారంభించబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. రూ.26.71 కోట్లతో 62 ఎంజేపీ భవనాలను మరమ్మతులు చేస్తున్నామన్నారు. బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆహారభద్రత, రక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. గురుకుల విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్‌తో పాటు ట్రాక్ షూట్లు అందజేస్తున్నామన్నారు. చెస్ లో బీసీ గురుకులాల విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించేలా ఏపీ చెస్ అకాడమీ తో ఎంఓయూ కుదుర్చుకున్నామన్నారు. ఈ ఎంఓయూ తో విద్యార్థులు చెస్‌లో మరింత రాణించడమే కాకుండా, మానసిక ఒత్తిడిని జయించేందుకు వీలుకలుగుతుందని మంత్రి సవిత తెలిపారు.

**సొంతింటిని తలపించేలా హాస్టళ్ల నిర్వహణ**

బీసీ హాస్టళ్లలో విద్యార్థులను సొంతింటి మాదిరిగా సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రంలో 998 బీసీ హాస్టళ్లు ఉన్నాయని, వాటిలో 85 వేల మంది విద్యార్థులు వసతి సౌకర్యం పొందుతున్నారని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ లో ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ సర్వేలో బీసీ హాస్టళ్ల నిర్వహణపై 78.02 మంది విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తంచేశారన్నారు. గత ప్రభుత్వంలో బీసీ హాస్టళ్లను పట్టించుకున్న పాపానపోలేదని, 5 ఏళ్లలో మరమ్మతులకు రూపాయి కూడా ఇవ్వలేదని, కనీసం బీసీ బిడ్డల కడుపు నింపే డైట్ బిల్లులు చెల్లించలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, గత ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.110 డైట్ ఛార్జీలను చెల్లించిందన్నారు. 104 బీసీ హాస్టళ్లలో ఎస్ఆర్ శంకరన్ రిసోర్సు సెంటర్లను ఏర్పాటు చేశామని, ఎఫ్ఆర్సీ విధానం ద్వారా విద్యార్థుల హాజరు నమోదు చేసి, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టామన్నారు. రెండేళ్లలో రూ.80 కోట్లతో హాస్టళ్ల భవనాల మరమ్మతులు, మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. రూ.6 కోట్లతో హాస్టళ్ల దోమ తెరలు ఏర్పాటు చేశామని, రూ.18 కోట్లతో వసతి గృహాలకు అవసరమైన వంట పాత్రలు విద్యార్థులకు అవసరమైన సామాగ్రి కొనుగోలు చేశామని తెలిపారు.

## సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఏ ఒక్క భక్తుని మనో భావాలు దెబ్బతిని ఉంటే, వారిని హృదయపూర్వకంగా మన్నించమని కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం గానీ, దేవాదాయ శాఖ గానీ, తిరుమల తిరుపతి దేవస్థానాలు గానీ ఎవరిపైనా వివక్ష చూపడం లేదు. అలాగే ఎవరైనా ఆరాధించే మహనీయులను కించపరచే ఉద్దేశం కూడా మాకు లేదు. సాయిబాబా పట్ల కోట్లాది మంది భక్తులకు అపారమైన విశ్వాసం ఉంది. ఆ విశ్వాసాన్ని మేము పూర్తిగా గౌరవిస్తాము. సాయిబాబా ఆలయాల్లో పూజలు హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా జరుగుతున్నాయన్న విషయం కూడా అందరికీ తెలిసిందే. అయితే టీటీడీ ఆధ్వర్యంలో చేపడుతున్న 5,000 భజన మందిరాలు నిర్మాణ కార్యక్రమానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచారం మరియు గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ హిందూ దేవాలయాల నిర్మాణమే ఆ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమానికి సంబంధించి నిధుల విడుదల టీటీడీ రూపొందించిన మార్గదర్శకాలు, శ్రీవాణి ట్రస్టు నిబంధనలు మరియు పరిపాలనా విధానాల ప్రకారమే జరుగుతోంది.ఇది ఎవరి విశ్వాసాన్ని తక్కువ చేసి చూడడం కాదు. నిధుల కేటాయింపు అనేది పూర్తిగా ట్రస్టు లక్ష్యాలు, నిబంధనలు మరియు పరిపాలనా మార్గదర్శకాల ఆధారంగా జరుగుతున్న ప్రక్రియ మాత్రమే. సాయిబాబా ఆలయాలకు ఈ పథకం కింద నిధులు ఇవ్వకపోవడం అంటే సాయిబాబా స్వామివారిని లేదా ఆయన భక్తులను అవమానించడం కాదని మరోసారి స్పష్టం చేస్తున్నాను.

మన సమాజంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరమశివుడు, అమ్మవారు, అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా వంటి అనేక ఆరాధనా రూపాల పట్ల ప్రజలకు అపారమైన విశ్వాసం ఉంది. ప్రభుత్వం ఏ విశ్వాసాన్నీ కించపరచదు. ప్రతి భక్తుని మనోభావాలను గౌరవించడం మా ప్రభుత్వ విధానం. కాబట్టి ఈ అంశాన్ని అనవసర వివాదంగా మార్చడం సరికాదు. ఇది భక్తి, విశ్వాసాలకు సంబంధించిన అంశం కాదు. ట్రస్టుల లక్ష్యాలు, వాటి నిబంధనలు మరియు పరిపాలనా విధానాలకు సంబంధించిన అంశం మాత్రమే. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు ప్రతి భక్తుని విశ్వాసాన్ని గౌరవించడం మా ప్రభుత్వం మరియు దేవాదాయ శాఖ యొక్క స్పష్టమైన విధానం.సాయిబాబా భక్తుల విశ్వాసాన్ని మేము గౌరవిస్తాం. అదే సమయంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ట్రస్టుల లక్ష్యాలను కూడా గౌరవిస్తాం. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఎవరూ నమ్మవద్దని కోరుతున్నాను.

## ఓటర్ వెరిఫికేషన్‌పై సమావేశం

### ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



గూడూరు ( సింధూర దర్శిని) 24 జూన్ నెల్లూరు జిల్లా ; ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని టిడిపి బూత్ లెవల్ ఇన్చార్జిలు సీరియస్ గా తీసుకొని పనిచేయాలని ప్రతి ఓటు చాలా ముఖ్యమని అశ్రద్ధ వహిస్తే రాబోయే ఎన్నికల్లో ఇబ్బంది ఎదుర్కోవలసి వస్తుందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఓటర్ వెరిఫికేషన్ మరియు డోర్ టు డోర్ కార్యక్రమం పై నియోజకవర్గంలోని టిడిపి నాయకులు అనుబంధ సంఘ సభ్యులతో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం పై చర్చించారు. అనుబంధ సంఘ సభ్యులతో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం పై చర్చించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ బి ఎల్ ఓస్ తో టిడిపి బూత్ లెవెల్ ఇన్చార్జిలు కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఓటును వెరిఫికేషన్ చేయాలని ఎక్కడైనా దొంగ బోట్లు ఉంటే వాటిని తొలగించాలని సూచించారు ఇప్పుడు కష్టపడి పనిచేసిన వారికే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసి లుగా అవకాశం ఇవ్వడం జరుగుతుందని అలాగే వచ్చే నెల నుండి డోర్ టు డోర్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతుందని ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని వాటిని గట్టిగా తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కిరణ్ కుమార్, మట్టం శ్రావణి రెడ్డి , బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయిల్, చంద్రమౌళి, శ్రీనివాసులు, రహీం ,శివకుమార్, హరికుమార్, దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## రొట్టెల పండుగ నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టండి

### కమిషనర్ వై.ఓ. నందన్



నెల్లూరు (సింధూర దర్శిని) 24 జూన్ నెల్లూరు జిల్లా ; రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులను కమిషనర్ వై.ఓ నందన్ సూచించారు. రొట్టెల పండుగ నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని కార్యాలయంలోని కమీషనర్ ఛాంబర్ లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు పండుగ జరిగే దర్గా ప్రాంగణంలో మంచినీటి సదుపాయం, హైమాక్స్ విద్యుత్‌లైట్లు, తాత్కాలిక అంతర్గత దారుల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, బ్లీచింగ్, సున్నం, మొబైల్ టాయిలెట్లు, బయో టాయిలెట్లు, రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు, సి.సి కెమెరాలు, పార్కింగ్ ఏర్పాట్లు, పార్కింగ్ ప్రాంతాల్లో వసతులు, మైక్ అనౌన్స్మెంట్, ఘాట్ ప్రాంతంలో షవర్ల ఏర్పాటు, దుకాణాల మార్కింగ్, రూట్ మ్యాప్ ల ప్రదర్శన, క్యూఆర్ కోడ్ స్కానర్ల ద్వారా మార్గం వివరాలు, బారికేడ్ల నిర్మాణం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దినేష్, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రహంతు జానీ, ఈ.ఈ లు శేషగిరిరావు, అనిల్ కుమార్, సిటీ ప్లానర్ రఘురాధరావు, టి.పి.ఆర్.ఓ వాసు బాబు, మేనేజర్ రాజేశ్వరి, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్ లు, శానిటేషన్ సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం అందించాలి

### కమిషనర్ వై ఓ.నందన్

నెల్లూరు (సింధూరదర్శిని) 24 జూన్ నెల్లూరుజిల్లా; నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు బుధవారం స్థానిక బి.వి నగర్ మెయిన్ రోడ్డు ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైను కాలువ నిర్మాణానికి సంబంధించి అందుకున్న ఫిర్యాదుకు శాశ్వత పరిష్కారం అందించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ రఘునాథ రావు, సర్వేయర్ కామేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.





# వీఆర్వో నిర్లక్ష్యం..

# రైతులకు తప్పని తిప్పలు

**నెలలు గడుస్తున్న నిర్లక్ష్య ధోరణిలో వీఆర్వో**

**వీఆర్వో కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు**

**తహసిల్దార్‌ను సంప్రదించిన రైతులకు తప్పని తిప్పలు**

**తాసిల్దార్ ఆదేశాలను కూడా లెక్కచేయని వీఆర్వో నిర్లక్ష్య ధోరణి**

**ఫైల్ పై సంతకం పెట్టాలంటే తాంబూలం ఇవ్వాల్సిందేనా...? అంటున్నారు రైతులు**

గూడూరు (సింధూరదర్శిని) 24 జూన్ నెల్లూరు జిల్లా; వీఆర్వో నిర్లక్ష్యం వల్ల రైతులకు తిప్పలు తప్పడం లేదంటూ బలమైన విమర్శలు వినిపిస్తున్నాయి. సైదాపురం మండలం లోని మొలకలపూండ్ల రెవిన్యూ లో విధులు నిర్వహిస్తున్న వీఆర్వో రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ..! అంతా నా ఇష్టం..! ఈ రెవెన్యూ లో నేను చెప్పిందే వేదం, నేను చెప్పిందే శాసనం..! అంటూ వీఆర్వో నిర్లక్ష్య ధోరణికి రైతులు ఉసురుమంటున్నారు. అంతేకాకుండా ఈ రెవెన్యూలో పని చేయడం నాకు ఇష్టం లేదంటూ రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణితో ప్రవర్తిస్తూ రైతులను కార్యాలయం చుట్టూ కొన్ని నెలల నుండి తిప్పుకుంటున్నట్లు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సైదాపురం మండల కేంద్రంలో నివాసముంటున్న ఓ రైతు మొలకలపూండ్ల రెవిన్యూలో ఉన్న పొలానికి విద్యుత్ సర్వీస్ కోసం వీఆర్వోకి దరఖాస్తు చేసుకోగా సంతకం పెట్టేందుకు సుమారు 1 నెల 15 రోజుల నుండి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ..! నాకు ఈ రెవిన్యూ లో పనిచేయడం ఇష్టం లేదు అంటూ, రెవెన్యూలో పనిచేస్తూ కూడా రైతులకు అవసరమైన విద్యుత్ సర్వీస్ కోసం సంతకం పెట్టేందుకు నిరాకరిస్తూ నిర్లక్ష్య ధోరణిలో ఫోన్ చేసిన లిఫ్ట్ చేయలేకపోవడం, ఫోన్ లిఫ్ట్ చేసిన బయట ఉన్నాను అంటూ ఫోన్ పెట్టేయడం వంటి "రాక్షస ఆనందం పొందుతూ" రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ రైతులపై చిన్న చూపు చూస్తున్నారు, అంటూ , రైతులు మండిపడుతున్నారు. ఈ విషయంపై తాసిల్దార్ సుభద్ర దృష్టికి తీసుకెళ్లిన తాసిల్దార్ నిర్లక్ష్య ధోరణితో మొలకల పూండ్ల రెవిన్యూలో పనిచేయడం వీఆర్వోకి ఇష్టం లేనందువల్ల అలా ప్రవర్తిస్తుందని అనడంలో సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతులకు పెద్దపీట వేస్తూ, రైతుల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ, రైతులకు అండగా నిలుస్తున్నారు. సైదాపురం మండలం కేంద్రంలో మాత్రం కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల అభివృద్ధిని అడ్డుకుంటూ వారి ఆశయాలను తుంగలో తొక్కుతూ, రాక్షస ఆనందం పొందుతున్నారు అనడంలో సందేహమే లేదు అంటున్నారు రైతులు. ఇకనైనా రెవిన్యూ ఉన్నత అధికారులు స్పందించి వీఆర్వో నిర్లక్ష్య ధోరణికి కళ్లెం వేసి, వీఆర్వో పై శాఖ పరమైన చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేసి, రైతుల అభివృద్ధికి సహకరించాలని వేడుకుంటున్నారు.

### సైదాపురం తాసిల్దార్ సుభద్ర వివరణ

మొలకలపూండ్ల వీఆర్వో ఆగడాలపై తాసిల్దార్ సుభద్రను " సింధూరదర్శిని" ఫోన్‌లో వివరణ కోరగా నేను మాట్లాడి సంతకం పెట్టిస్తాను గురువారం రైతును పంపించండి అని తెలిపారు.

# సమన్వయంతో బందోబస్తు నిర్వహించాలి

-జిల్లా ఎస్పీ అజితా వెజెండ్ల

-బారా షహీద్ దర్గా రొట్టెల పండుగ-2026 బందోబస్తు ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల పరిశీలన



నెల్లూరు ( సింధూర దర్శిని) 24 జూన్ నెల్లూరు జిల్లా ; బారా షహిద్ దర్గా రొట్టెల పండుగ-2026 సందర్భంగా చేపట్టిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల సాయంత్రం బారా షాహిద్ దర్గా పరిసర ప్రాంతాలు, కమాండ్ కంట్రోల్ రూమ్, అవుట్ పోస్టుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సౌజన్య, టౌన్ దీక్ష, రూరల్ డి.ఎస్.పి ఘట్టమనేని శ్రీనివాసరావు మరియు టౌన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ప్రధాన సూచనలు / ఆదేశాలు కమాండ్ కంట్రోల్ వ్యవస్థ పరిశీలన పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరును ఎస్పీ పరిశీలించారు. ఎల్‌ఈడి డిస్‌ప్లేలు, డ్రోన్ సర్వేలెన్స్, సీసీటీవీ మానిటరింగ్ వ్యవస్థల అనుసంధానం పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. పి సి ఆర్ మరియు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

**24ఐ7 పోలీస్ అప్రమత్తత**

పండుగ సమయంలో ఏర్పాటు చేసే పోలీస్ అవుట్ పోస్టులను 24×7 అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. తప్పిపోయిన చిన్నారుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్ ఎఫ్ ఐ డి ట్యాగ్స్ ఏర్పాటు ద్వారా మిస్సింగ్ చిల్డ్రన్ ట్రాకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

**భక్తుల రాకపోకలు - సౌకర్యాలు**

అన్ని రూట్లను పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిర్ణయించిన ప్రదేశాలు దాటి షాపులు, పుష్‌కార్ట్‌లు ఏర్పాటు చేయకుండా చూడాలని ఆదేశించారు.

సెక్టార్ ఇన్‌చార్జులు తమ సిబ్బందికి పూర్తి స్థాయి బ్రీఫింగ్ ఇచ్చి ఏర్పాట్లు పక్కాగా అమలు చేయాలని తెలిపారు.

**ట్రాఫిక్ నియంత్రణ చర్యలు**

ట్రాఫిక్ రెగ్యులేషన్స్ పకడ్బందీగా అమలు చేయాలని ట్రాఫిక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ సమాచారం ప్రజలకు త్వరగా చేరేలా డిజిటల్ కమ్యూనికేషన్, ఎల్‌ఈడి స్క్రీన్స్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలు మరియు మార్గదర్శకాలు తెలియజేయాలని సూచించారు. ఈ సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని డిడి అండ్ ఐ ఎన్ పి ఆర్ వారికి సూచించారు.

**ఘాట్ ఏరియా భద్రతా ఏర్పాట్లు**

భక్తులు రొట్టెల మార్పిడి చేసే ఘాట్ ప్రాంతాలను జిల్లా ఎస్పీ సందర్శించారు. నీటి లోతు, స్టెప్‌ల భద్రత, బోటింగ్ సేఫ్టీ అంశాలను పరిశీలించారు. సంబంధిత శాఖల నుండి అవసరమైన సేఫ్టీ సర్టిఫికెట్లు పొందాలని, భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

**వాహనాల నియంత్రణ**

పండుగ ప్రాంతంలోకి జిల్లా కలెక్టర్ గారు మరియు మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన పాసులు ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని స్పష్టం చేశారు. వాహనాల రాకపోకలను కఠినంగా నియంత్రించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రశాంత వాతావరణంలో బారా షహిద్ దర్గా రొట్టెల పండుగ-2026 విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని

# నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం


రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ విభజనతో తిరుపతి ప్రజలకు మెరుగైన సేవలు

భూ రీ-సర్వే 2.0 ద్వారా పారదర్శక భూ పరిపాలనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

మార్కెట్ యార్డ్ నుండి తాజ్ సర్కిల్ వరకు నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం

తాజ్ సర్కిల్ నుండి శ్రీనివాసపురం వాటర్ ట్యాంక్ వరకు శాశ్వత పైప్‌లైన్ నిర్మాణ పనులకు భూమిపూజ

జిల్లా చార్జ్ మంత్రి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



తిరుపతి ( సింధూర దర్శిని) 24 జూన్ తిరుపతి జిల్లా ; తిరుపతి ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్న రిజిస్ట్రేషన్ సేవల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని విభజించి తిరుచానూరులో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మరింత సులభంగా, వేగవంతంగా సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. బుధవారం తిరుచానూరులో ఏర్పాటు చేసిన నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ కమిషనర్ మరియు ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దుగ్గుమల్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానానికి అనుగుణంగా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు, రిజిస్ట్రేషన్ లావాదేవీలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో కొత్త కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తిరుచానూరు ప్రాంతంలో ఉన్న పాత సచివాలయ భవనాన్ని ఆధునీకరించి తాత్కాలికంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా మార్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత భవనాన్ని నిర్మించి అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు కూడా రానున్న రెండు నుంచి మూడు సంవత్సరాల్లో శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే 2.0 కార్యక్రమంపై మంత్రి ప్రత్యేకంగా స్పందిస్తూ, గతంలో సర్వే ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, ప్రస్తుతం ప్రతి పట్టాదారుకు పూర్తి సమాచారం అందిస్తూ అత్యంత పారదర్శకంగా రీ-సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. వాట్సాప్ గ్రూపులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణ, ఈ-కేవైసీ ధృవీకరణ వంటి విధానాల ద్వారా భూ యజమానుల సమ్మతి, ధృవీకరణ అనంతరమే సర్వే పూర్తయినట్లు నిర్ధారిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన సుమారు 7.5 లక్షల ఫిర్యాదులు, దరఖాస్తులను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భూమి వివాదాలు, 22-ఏ భూములకు సంబంధించిన అంశాలు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంలో చట్టపరమైన విధానాలను అనుసరిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తాజ్ సర్కిల్ నుండి శ్రీనివాసపురం వాటర్ ట్యాంక్ వరకు ఏర్పాటు చేయనున్న శాశ్వత పైప్‌లైన్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ పైప్‌లైన్ పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడి, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి పంపిణీ వ్యవస్థ బలోపేతం కానుందని తెలిపారు. అనంతరం శ్రీనివాసపురం గ్రామ పంచాయతీ పరిధిలో మార్కెట్ యార్డ్ నుండి తాజ్ సర్కిల్ వరకు నిర్మించిన సీసీ రోడ్డు మరియు మురుగు కాలువలను మంత్రి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ పనులు ప్రాంతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడటంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా, పారిశుధ్య సౌకర్యాలను అందించనున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఆర్డీఓ శ్రీ రామ్మోహన్, జిల్లా రిజిస్ట్రార్ శ్రీ రామ్‌కుమార్, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ నరసింహ యాదవ్, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి సుగుణమ్మ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ప్రజాప్రతినిధులు, అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

## ఆలయ చైర్మన్ కంటి రామ్మోహన్ రావు

గూడూరు( సింధూర దర్శిని) 24 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణం రాజా వీధిలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు బుధవారం సాయంత్రం ఏడు గంటలకు అంకరార్పణతో మొదలయ్యి, జూలై 4 2026 శనివారం ఉదయం లక్ష తులసి పూజ , మధ్యాహ్నం భారీ అన్నదానము, సాయంత్రం ఏకాంత సేవతో అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించబడును, ఈ బ్రహ్మోత్సవాలకు గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ పూర్తి సహాయ సహకారాలు తో,దేవస్థానం ధర్మకర్త మండలి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగును, కావున గూడూరు పట్టణం మరియు పరిసర ప్రాంత భక్త జనులు అందరూ కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనానికి వచ్చి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు సేకరించి, స్వామి వారి కృపాకటాక్షంలో పొందవలసిందిగా కోరుకుంటున్నాం, ప్రతి ఒక్కరికి ఇదే మా ఆహ్వానం తెలియజేసుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త మండలి సభ్యులు పేపళ్ల అమరయ్య నాయుడు, కొమ్మా రవీంద్రబాబు, ఉప్పు సాయి కృష్ణ, ఓబిలి బాబు, ముని కోటేశ్వర్ రెడ్డి, బుల్లయ్య, తదితరులు, పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

పేదలకు సంపూర్ణ భూ హక్కులు కల్పించడమే లక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

తిరుపతి అభివృద్ధిని అడ్డుకునే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్




తిరుపతి (సింధూర దర్శిని) 24 జూన్ తిరుపతి జిల్లా ; తిరుపతి నగరం మరియు పరిసర ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాల్ నందు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి భూ సమస్యలపై నిర్వహించిన సమీక్ష అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ఆదేశించారన్నారు. ముఖ్యంగా పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరిష్కార మార్గాలను రూపొందిస్తున్నామన్నారు. దామినేడు, శ్రీనివాసపురం, పద్మావతి నగర్, సాయినగర్, కరకంబాడి, సీతారాం నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై సమగ్రంగా చర్చించామని, సంబంధిత అధికారుల నుంచి నివేదికలు సేకరించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. తిరుపతి నగర ప్రాంతంలో వివిధ రకాల భూ వర్గీకరణల కారణంగా దశాబ్దాలుగా సమస్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. మఠం భూములు, చెరువులు, కాలువలు, వాగులు, రివర్ పోరంబోకు తదితర భూములపై వేలాది కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నప్పటికీ పూర్తి హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దామినేడు ప్రాంతంలో సుమారు 262 ఎకరాల్లో సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్నాయని, అనేక సంవత్సరాలుగా భూముల కొనుగోలు విక్రయాలు జరిగినప్పటికీ రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు, విద్యా అవసరాల కోసం ఆస్తులను వినియోగించుకునే అవకాశం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేదలకు భూ హక్కులు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించినట్లే, ప్రస్తుతం ఉన్న సమస్యలపై కూడా చట్టబద్ధమైన పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు. డీకేటీ భూములు, పీవోటీ నిబంధనల కారణంగా ఉత్పన్నమైన సమస్యలను కూడా అధ్యయనం చేసి, చట్టబద్ధంగా ప్రజలకు హక్కులు కల్పించే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. రూరల్ మరియు అర్బన్ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ భూ సమస్యలు ఉన్నాయో గుర్తించి, అవసరమైతే కేబినెట్ స్థాయిలో నిర్ణయాలు తీసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతామని వెల్లడించారు. తిరుపతిని రాష్ట్ర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ, ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తిరుచానూరు మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి ఆమోదం లభించిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆవిలాల చెరువు అభివృద్ధికి తొలి దశలో రూ.31 కోట్లతో టెండర్లు పిలిచామని, మొత్తం రూ.110 కోట్ల వ్యయంతో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు చేయనున్నట్లు తెలిపారు. పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, తిరుపతికి వచ్చే భక్తులు అదనంగా ఒకటి లేదా రెండు రోజులు గడిపేలా మౌలిక సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు మరియు సోషల్ మీడియా వేదికల ద్వారా తిరుపతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. ఆవిలాల భూముల అంశంపై జరుగుతున్న ప్రచారాలన్నీ వాస్తవాలకు విరుద్ధమని, సంబంధిత వ్యవహారాల్లో కోర్టు ఉత్తర్వులు, రెవెన్యూ అధికారుల నిర్ణయాలు, చట్టబద్ధ ప్రక్రియల అనంతరమే చర్యలు జరిగాయని స్పష్టం చేశారు.సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికల ద్వారా వ్యక్తులపై ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఇప్పటికే కొన్ని అంశాలపై కేసులు నమోదయ్యాయని, పరువు నష్టం దావాలు కూడా దాఖలు చేశామన్నారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించే, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మఠం భూముల సమస్యలపై ఎండోమెంట్స్ శాఖ అధికారులు, మంత్రులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, హక్కుదారులతో చర్చలు జరిపి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అవసరమైతే తానే స్వయంగా సంబంధిత వర్గాలతో సమావేశమై సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భూ సమస్యలపై వందలాది మంది ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించామని, త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి, తిరుపతి, చంద్రగిరి మరియు పరిసర ప్రాంతాల్లోని భూ సమస్యల పరిష్కారానికి తుది కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, ఏపి మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు పాల్గొన్నారు.

# వినుకొండ పట్టణానికి ఎన్ఎస్పి ప్రాంగణం ఒక మణిహారం

**రూపురేఖలు మారనున్న ఎన్ఎస్పి ప్రాంగణం**

**ఎన్ఎస్పి స్థలం అభివృద్ధికి వేగం పెంచిన ప్రభుత్వం**

**డిఆర్డిపి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**

**హడ్కో ద్వారా రూ.7 కోట్లు - సీసీ రోడ్లు, డ్రైనేజీకి రూ.1 కోటి మంజూరు**

**15 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం**



వినుకొండ సింధూరదర్శిని:

వినుకొండ పట్టణ అభివృద్ధికి కీలకంగా మారనున్న 22 ఎకరాల ఎన్ఎస్పి స్థలం సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఆర్డీఏ, పీపీపీ ప్రత్యేక అధికారి విశాల్, ప్లానర్ కమల్, పల్నాడు జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు. వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డుకు ఆనుకుని ఉన్న 22 ఎకరాల ఎన్ఎస్పి స్థలంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డెమో మాస్టర్ ప్లాన్‌ను అధికారులు చీఫ్ విప్‌కు వివరించారు. ఈ స్థలంలో ఆధునిక వ్యాపార సముదాయాలు, క్రీడా స్టేడియం, పార్కులు, వినోద కేంద్రాలు, ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రైవేట్--పబ్లిక్ పార్ట్నర్‌షిప్ విధానంలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే ఆదర్శప్రాయమైన పట్టణాభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, హడ్కో ద్వారా ఈ ప్రాజెక్టు కోసం రూ.7 కోట్ల రుణ నిధులు మంజూరైనట్లు తెలిపారు. అలాగే స్థలంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం రూ.1 కోటి ప్రత్యేక నిధులు ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు.

ఎన్ఎస్పి స్థలం అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించిన ఆయన, 15 రోజుల్లో సమగ్ర డీపీఆర్ మరియు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి మున్సిపల్ శాఖకు సమర్పించాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. వినుకొండ పట్టణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలుస్తుందని, ఉపాధి అవకాశాల సృష్టితో పాటు వ్యాపార, క్రీడా, వినోద రంగాలకు కొత్త ఊతం లభిస్తుందని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ డీఈ, వినుకొండ మున్సిపల్ కమిషనర్, ఏఈ తదితర అధికారులు పాల్గొన్నారు. అధికారులు త్వరలోనే సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసి మున్సిపల్ శాఖకు అందజేస్తామని హామీ ఇచ్చారు.



## రైతులు సంరక్షణ దిశగా అడుగులు వేయండి..

**రైతులకు సూచనలు ఇచ్చిన వ్యవసాయ అధికారులు**

మాచవరం జూన్ 24 సింధూరదర్శిని: ఈనెల 26–27 ఖరీకు భూ సంరక్షణ దిశగా అడుగులు ముందుకు వేసి పంటలు సాగుచేయాలి అని ఏరువాక కోఆర్డినేటర్ డా వీ.నాగేష్ తెలియచేశారు. రాబోవు కాలంలో LNINO దృష్టిలో వుంచుకొని బ్రేతులు వరి పంటను ఎక్కడైతే బోర్ బావులు నీటి వసతి వుంటుందో అక్కడ మాత్రమే వేసుకుని, మిగిలిన ప్రాంతం లో ఆరుతడి పంటలు అయిన కంది, ప్రత్తి,అపరాలు, చిరుధాన్యాలు,సాగుచేసుకోవాలిని సూచించారు. బుధవారం మండల కేంద్రమైన మాచవరంలో జరిగిన రైతు అవగాహన సదస్సు కార్యక్రమంలో మాట్లాడారు. భూసార పరక్షణలో భాగంగా జీవన ఎరువులు అయిన వాూవీ పౌడర్ ఎకరా 5KGS చొప్పున అలాగే,నత్రజని,భాస్వరం ,పొటాష్ పోషకాలను పెంపొందించే జీవన ఎరువులను ఎకరానికి 1/2 లీటర్ చొప్పున వదలి అన్నారు.పై జీవన ఎరువు అన్ని చివరి దుక్కిలో లేదా విత్తనం పెట్టే ముందు తేమ ఉండేలా చూసుకొని సాయంత్రం వెళ్ళాలి అని సూచించారు.అలగే ఈ ఖరీఫ్ పంట కాలానికి అవువైన వరి, కంది, మిరప పంటలు రకాలను వాటి గుణగణాలను రైతులకు తెలియ చేశారు.పై కార్యక్రమంలో ణూూూ సెంటర్ కోఆర్డినేటర్ పీవీ సత్య గోపాల్ పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే.రామమ్మ మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమం మాచవరం RSK 1లో నిర్వహించబ డింది. ప్రభుత్వ పథకాలు,APAIMS APP ద్వారా యూరియా,DAP పంపిణీ మరియు ఈ ఖరీఫ్ సీజన్ కు ఎలనినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటం వల్ల ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి అని సూచించారు.ఈ కార్యక్రమంలో వాూూ మాచవరం ప్రియాంక మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రెండో రోజు కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన




వినుకొండ– సింధూరదర్శిని: ఆర్టీసీ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు బుధవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. అనంతరం జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిజి విన్సెంట్ అధ్యక్షత వహించగా జేఏసీ నాయకులు డిఎన్ఆర్. కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేయాలని, 12వ పిఆర్సిని నియమించాలని కోరారు. డిపో జేఏసీ నాయకులు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ 1/2019 సర్కులర్ ను అమలు పరచాలని, పెండింగు డిఏ ఇవ్వాలని కోరారు. డిపో జేఏసీ నాయకులు పి సాంబశివరావు మాట్లాడుతూ శ్రీ శక్తి పథకానికి 4000 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, 1000మంది సిబ్బందిని నియమించాలని, అక్రమ పనిష్మెంట్ల ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు సి వి జి రెడ్డి. మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి కీలకమైన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికులకు పాత పద్ధతిలోనే రిఫరల్ ఆసుపత్రి ద్వారా వైద్యసేవలు అందించాలని, ఐ.ఆర్ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమానికి జేఏసీ ఉద్యోగులు గుమ్మడి వెంకటేశ్వర్లు, రమణా రెడ్డి, ఎం పాపయ్య, ఏ ఆంజనేయులు, కె ఎస్ ఎన్ రెడ్డి, అరుణ్ కుమార్, ఎం పద్మ, మల్లేశ్వరి కిషోర్ మస్తాన్ వలి, ఎస్ ఎస్ ఎన్ రెడ్డి, గణపవరం శ్రీను, శివ నాయక్, రజాక్,డి హెచ్ నాయక్ ,శివ నాగేశ్వరరావు హాజరై విజయవంతం చేశారు.

# కూటమి నేతలపై మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘాటు విమర్శలు

**నా భూముల వివరాలు వెల్లడిస్తా, విజ్ఞాన్ భూముల వివరాలు తెలపాలి!...**

**ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, జీవి ఆంజనేయులుకు మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సవాల్: "వ్యాపారాల బ్యాలెన్స్ షీట్ చూపిద్దామా.?"**

**అధికారంలో ఉండి రెండేళ్లవుతున్నా నాపై కబ్జా ఆరోపణలు నిజమైతే ఎందుకు స్వాధీనం చేసుకోలేదు?: మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు**

**వినుకొండ నియోజకవర్గంలో మట్టి మాఫియా, రియల్ ఎస్టేట్ అక్రమాలు..**

**కూటమి ప్రభుత్వంపై వినుకొండలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఫైర్**

వినుకొండ -సింధూరదర్శిని:

నా భూముల వివరాలు మొత్తం వెల్లడిస్తాను, విజ్ఞాన్ విద్యాసంస్థల పేరుతో ఉన్న భూముల వివరాలన్నీ తెలపాలని" నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలను మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కోరారు. బుధవారం వినుకొండ వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. తాను అక్రమంగా భూములు తీసుకుంటున్నానని చెబుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, చీఫ్ విప్ జీవి ఆంజనేయులు వారు రెండేళ్లుగా అధికారంలో ఉన్నారు కదా, తాను కబ్జా చేసిన భూములు ఎందుకు స్వాధీనం చేసుకోలేదని బ్రహ్మనాయుడు గారు ప్రశ్నించారు. అంటే కూటమి ప్రభుత్వం విఫలమైనట్లే కదా అని ఆయన ప్రశ్నించారు. తాను పూర్తి వివరాలు తెలియక హైదరాబాదులో భూమికి కొంత అడ్వాన్స్ ఇచ్చిన మాట వాస్తవమేనని, ఈ పొరపాటు వల్లే జైలుకు వెళ్లి వచ్చానని, అయితే కూటమి అధినేతలు కొందరు జైలుకు ఎందుకు వెళ్లి వచ్చారో చెప్పాలన్నారు. ఇక జీవి వినుకొండ ప్రాంతం ఉప్పలపాడులో జీవి కుటుంబ సభ్యులతో ఉన్న 50 ఎకరాల భూమి హైదరాబాద్ వారికి అమ్మలేదా అని ప్రశ్నించారు. అలాగే ఖమ్మంపాడులో భూములకు కంచె వేశారని, శావల్యాపురంలో ఆంజనేయస్వామి మాన్యం, వినుకొండ సమీపంలో ఎన్ఎస్పి కాలువపై అక్రమంగా గెస్ట్ హౌస్ నిర్మాణం, ఇనిమెళ్ళలో స్మశాన భూమి, కొచ్చర్ల, బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెంలో భూములు జీవి బంధువుల పేరుతో పాస్ పుస్తకాలు పుట్టలేదా అని బ్రహ్మనాయుడు గారు ప్రశ్నించారు. అలాగే జీవి నిర్వహిస్తున్న పలు కంపెనీలకు జీఎస్టీ కడుతున్నారా లేదా అని ప్రశ్నించారు. ఆరు మాసాలకు ఒక కంపెనీ పెడుతూ జీఎస్టీ కట్టకుండా ప్రభుత్వాన్ని మోసం చేయటం లేదా అని జీవిని బొల్లా ప్రశ్నించారు. దొండపాడు గ్రామంలో జీవి అనుచరులు మట్టి మాఫియాగా తయారై పెద్ద పెద్ద కుంటలు చేస్తున్న క్రమంలో అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనికి కూడా జీఎస్టీ కట్టకుండా ఎగవేయడం



జరుగుతున్నా రెవెన్యూ అధికారులు నోరెత్తడం లేదని ఆయన విమర్శించారు. అలాగే కొప్పుకొండ గ్రామంలో 130 ఎకరాల మాన్యం భూములు జీవి అనుచరులు సొంతం చేసుకున్నారన్నారు. నియోజకవర్గంలో ఉపాధి హామీ పనుల్లో పెద్ద గోల్మాల్ జరుగుతుందని, దొంగ లెక్కలు చూపి అందిన కాడికి దోచుకుంటున్నారన్నారు. అలాగే వైసీపీ వర్గానికి చెందిన కూలీలకు ఉపాధి హామీ పనులు ఇవ్వకుండా తమ వారికే పనులు కల్పిస్తున్నారని బ్రహ్మనాయుడు విమర్శించారు.

ఇక బయో ఫెర్టిలైజర్స్ ముసుగులో పలు మోసాలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. తాను చేసే వ్యాపారాలకు బ్యాలెన్స్ షీట్ చూపిస్తానని, అలాగే జీవి చేసే వ్యాపారాలకు బ్యాలెన్స్ షీట్ చూపించాలని సవాల్ విసిరారు. అలాగే వినుకొండ ప్రాంతంలో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం, కాకినాడ, కృష్ణపట్నం పోర్టులో జీవి పేరు తెలియని వారు లేరని ఆయన అన్నారు. తమ హయాంలో ఇంటింటికి మంచినీరు సరఫరా చేస్తే, నేడు మద్యం సరఫరా చేస్తున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. వినుకొండలో రియల్ ఎస్టేట్ మాఫియా ఎంతో దుందుడుకుగా వ్యవహరిస్తున్నా అర్బన్ డెవలప్మెంట్ అధికారులు కళ్ళు మూసుకుని చూస్తున్నారన్నారు. అప్రూవల్ లేకుండా అక్రమ వెంచర్లు వేసి నిబంధనలకు వ్యతిరేకంగా అమాయకులను మోసం చేసి కోట్లు గడుస్తున్నారని బ్రహ్మనాయుడు గారు విమర్శించారు.

అలాగే స్థానిక మార్కాపురం రోడ్లో అక్రమ వెంచర్లు వేసి నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నా జీవికి తెలిసి కూడా చూడనట్లు ఉంటున్నారన్నారు. వినుకొండలో ఓ ప్రజా ప్రతినిధి అప్పుడు తమ పార్టీలో ఉండి తమ వెంట తిరిగి జీవిని తిట్టిన వారే నేడు జీవి పక్కన చేరి నన్ను విమర్శించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఇక స్కూల్స్ తెరిచి రోజులు గడుస్తున్నప్పటికీ యూనిఫామ్, స్కూల్ బ్యాగ్స్ ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు. ఆరోగ్యశ్రీ ఏ ఆసుపత్రులలో అమలు కాక పేద ప్రజలు ఆరోగ్య సమస్యలపై అల్లాడుతున్నారు అన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ ఇంతవరకు విడుదల చేయలేదని, అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ జటిలంగా మారుతున్నా ఇక్కడున్న ప్రజానేతలిద్దరికీ పట్టడం లేదని బొల్లా బ్రహ్మనాయుడు గారు పలు ఘాటు విమర్శలు చేశారు.

# విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

వినుకొండ -సింధూరదర్శిని:

విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం, వినుకొండ వారి ఆధ్వర్యంలో బుధవారం సంఘం భవన ఆవరణలో 104 వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీ॥శే అవ్వారు రంగయ్య, ధర్మపత్ని సీతా రావమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు అవ్వారు కోటేశ్వరరావు వారి ధర్మపత్ని పద్మావతి ల కుమారుడు నాగ సతీష్,కోడలు రాధిక ల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని వారి చేతుల మీదుగా



ప్రారంభించారు. ఈ సందర్భంగా వై వి. సుబ్బయ్య శర్మ, మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం వారి సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల. కృష్ణమూర్తి, రాఘవయ్య, బిపిఎస్. సుందర్రావు,బోదా జయలక్ష్మి, దొంతు మల్లేశ్వరి, మంచి రాజ్యలక్ష్మి, మురుగుల పద్మావతి, వెంకటస్వామి, దీక్షితులు, శంకర్రావు, ఆది రాములు, రామలింగేశ్వరరావు, దుబ్బల దాసు, మస్తాన్, కోటిలింగం, ఆవుల రమేష్, సామ్యూల్ పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ సీఎండీ పోస్టు..

-తొలిసారిగా ప్రైవేటు రంగానికి అవకాశం

-బీఎస్ఎన్ఎల్ సీఎండీ పోస్టు భర్తీకి కేంద్రం ప్రకటన

-తొలిసారిగా ప్రైవేట్ రంగ నిపుణులకు అవకాశం కల్పన

-దాదాపు రెండేళ్లుగా పూర్తిస్థాయి అధిపతి లేకుండా సంస్థ

-భారీ నష్టాలతో సతమతమవుతున్న బీఎస్ఎన్ఎల్

దరఖాస్తుల స్వీకరణకు జూలై 22 చివరి తేదీగా నిర్ణయం

ప్రభుత్వ రంగ టెలికాం దిగ్గజం భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) పదవి భర్తీకి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. విశేషమేమిటంటే, ఈసారి ప్రైవేట్ రంగ నిపుణులకు కూడా ఈ పదవికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తూ టెలికాం శాఖ (డీఓటీ) నిర్ణయం తీసుకుంది. దాదాపు రెండేళ్లుగా పూర్తిస్థాయి అధిపతి లేకుండా కొనసాగుతున్న బీఎస్ఎన్ఎల్‌కు ఇది అత్యంత కీలక నియామకం. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ (పీఈఎస్బీ) ఛైర్మన్ నేతృత్వంలోని సెర్చ్-కమ్-సెలక్షన్ కమిటీ (ఎస్సీఎస్సీ) ఈ నియామక ప్రక్రియను పర్యవేక్షించనుంది. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 22 సాయంత్రం 3 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ పదవికి వేతన స్కేలు నెలకు రూ. 80,000 నుంచి రూ. 1,25,000 వరకు నిర్ణయించారు. ప్రస్తుతం టెలికాం శాఖ ఉన్నతాధికారి రాబర్ట్ జె. రవి అదనపు బాధ్యతలతో సీఎండీగా కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలాన్ని 2026 అక్టోబర్ వరకు పొడిగించారు. ఈ పదవికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 45 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలి. ఇంజనీరింగ్, సీఏ, కాస్ట్ అకౌంటెన్సీ లేదా మేనేజ్‌మెంట్ విభాగాల్లో విద్యార్హతలు కలిగి ఉండటం తప్పనిసరి. ప్రైవేట్ రంగ అభ్యర్థులైతే, గత మూడేళ్లుగా సగటున రూ. 2,000 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న సంస్థలో బోర్డు స్థాయి హోదాలో పనిచేసిన అనుభవం ఉండాలి. గతంలో 2025 నాటికి ఈ పదవిని భర్తీ చేయాలని ప్రయత్నించినప్పటికీ, తగిన అభ్యర్థి లభించకపోవడంతో ఈసారి విస్తృత స్థాయిలో నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రైవేట్ టెలికాం సంస్థల నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్న బీఎస్ఎన్ఎల్, ప్రస్తుతం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నికర నష్టం రూ. 4,738 కోట్లుగా నమోదైంది. ఈ నేపథ్యంలో 4జీ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం, 5జీ సన్నద్ధత, సంస్థను ఆర్థిక పునరుద్ధరణ పథంలో నడిపించడం వంటి కీలక బాధ్యతలు కొత్త సీఎండీపై ఉండనున్నాయి.

# స్టాక్ మార్కెట్లకు భారీ జోష్.. 790 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్


భారీ లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

790 పాయింట్లు పెరిగి 77,000కు చేరువలో సెన్సెక్స్

24,000 మార్క్ పైన స్థిరపడిన నిఫ్టీ

ఐటీ, బ్యాంకింగ్, రియల్టీ రంగాల షేర్ల కొనుగోళ్లతో ర్యాలీ

నష్టాల్లో ముగిసిన ఆటో, మెటల్ రంగాల సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), బ్యాంకింగ్, ఫైనాన్షియల్, రియల్టీ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో మార్కెట్లు లాభాల బాట పట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 790.54 పాయింట్లు లాభపడి 76,991.22 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 197.55 పాయింట్లు పెరిగి 24,021.65 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సెషన్ ఆరంభం నుంచే మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ కనిపించింది. కీలక రంగాల్లో ఇన్వెస్టర్లు షేర్లను కొనుగోలు చేయడంతో సూచీలు మంచి లాభాలను నమోదు చేశాయి. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్ షేర్లు అత్యధికంగా లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ రియల్టీ సూచీలు 2 శాతానికి పైగా లాభపడి మార్కెట్ ర్యాలీని నడిపించాయి. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా మంచి లాభాలను నమోదు చేశాయి. అయితే, నిఫ్టీ ఆటో, నిఫ్టీ మెటల్ సూచీలు నష్టాలతో ముగిశాయి. లాభాల స్వీకరణ కారణంగా ఈ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.10 శాతం, స్మాల్‌క్యాప్ 0.39 శాతం స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. టెక్నికల్ నిపుణుల ప్రకారం, నిఫ్టీకి 24,100స్థాయి వద్ద తక్షణ ప్రతిఘటన ఎదురవుతోంది. దీనిని అధిగమిస్తే బుల్లిష్ ట్రెండ్ కొనసాగి 24,200, ఆపై 24,400 స్థాయిలకు చేరే అవకాశం ఉంది. మరోవైపు, 24,000 మార్క్ తక్షణ మద్దతుగా, 23,900–23,800 జోన్ కీలక సపోర్ట్‌గా పనిచేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# సంతోషంగా ఉండాలా? ఈ చిన్న అలవాట్లు జీవితాన్నే మార్చేస్తాయి!

ఆనందం కూడా సాధనతో పెంచుకునే నైపుణ్యమే! – రోజూ మంచి విషయాలను గుర్తుచేసుకోవాలి

ఇతరులతో పోల్చుకోవడం తగ్గించాలి – వ్యాయామం, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలి – చిన్న విజయాలనూ సెలబ్రేట్ చేసుకోవాలి



ఆనందం అనేది ఒక్కరోజులో అకస్మాత్తుగా వచ్చేది కాదు. మంచి ఉద్యోగం వస్తే, ఇల్లు కొంటే, బ్యాంక్ బ్యాలెన్స్ పెరిగితేనే సంతోషంగా ఉంటామని చాలామంది భావిస్తారు. కానీ సైకాలజీ చెప్పేది మాత్రం మరోలా ఉంది. ఆనందం కూడా ఒక నైపుణ్యమే. దాన్ని ప్రతిరోజూ చిన్న చిన్న అలవాట్లతో పెంచుకోవచ్చు. జీవితంలో సమస్యలు లేకపోవడం ఆనందం కాదు. సమస్యల మధ్య కూడా మంచి విషయాలను గుర్తించడం, మనసును సరైన దిశలో నడిపించడం నిజమైన సంతోషానికి దారి తీస్తుంది. అందుకోసం పాటించాల్సిన 10 సులభమైన అలవాట్లు ఇవే.

**మంచి విషయాలను గుర్తించండి**

మన మెదడు సహజంగా సమస్యలపైనే ఎక్కువ దృష్టి పెడుతుంది. అందుకే రోజూ రాత్రి 'ఈ రోజు ఏం మంచి జరిగింది?' అని మిమ్మల్ని మీరే అడగండి. ఒక మంచి మాట వినడం, స్నేహితుడి సాయం, కుటుంబ సభ్యుడి ప్రేమ.. ఎంత చిన్న విషయమైనా గుర్తు చేసుకోండి. ఇలా చేయడం వల్ల ప్రతికూల ఆలోచనలు తగ్గుతాయి.

**ఇతరులతో పోల్చుకోవద్దు**

సోషల్ మీడియాలో కనిపించేది చాలా వరకు వారి జీవితంలోని మంచి క్షణాలే. వారి విజయాలను చూసి మీ జీవితాన్ని తక్కువగా అంచనా వేయకండి. ఇతరుల హైలైట్ వీడియోతో మీ నిజజీవితాన్ని పోల్చడం వల్ల నిరాశ పెరుగుతుంది. మీ ప్రయాణం మీది. దానిపైనే దృష్టి పెట్టండి.

**శరీరాన్ని కదిలించండి**

ఆనందానికి వ్యాయామం గొప్ప మందు. ఖరీదైన జిమ్ అవసరం లేదు. ఉదయం నడక, యోగా, సైక్లింగ్, డ్యాన్స్.. ఏదైనా సరే. రోజూ కొంతసేపు శారీరక శ్రమ చేస్తే మూడ్ మెరుగవుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.

**ఈ వ్యక్తులకు దూరంగా ఉండండి**

కొంతమందితో మాట్లాడిన తర్వాత ఉత్సాహం వస్తుంది. మరికొందరితో మాట్లాడితే మానసికంగా కుంగిపోతాం. అలాంటి వారితో హద్దులు పెట్టుకోవడం తప్పు కాదు. మీ మానసిక ప్రశాంతతను కాపాడుకోవడం కూడా అవసరమే.

**కృతజ్ఞతను అలవాటు చేసుకోండి**

రోజూ మీకున్న సౌకర్యాలను గుర్తు చేసుకోండి. మంచి భోజనం, కుటుంబం, ఆరోగ్యం, స్నేహితులు.. ఏదైనా కావచ్చు. కృతజ్ఞత భావం పెరిగితే లేనివాటికంటే ఉన్నవాటిపైనే మన దృష్టి నిలుస్తుంది.

**సరిపడా నిద్రపోండి**

నిద్రను త్యాగం చేసి మరీ పని చేయడం గొప్ప విషయం కాదు. నిద్రలేమి వల్ల మూడ్, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత దెబ్బతింటాయి. చిన్న సమస్యలు కూడా పెద్దవిగా అనిపిస్తాయి. కాబట్టి నాణ్యమైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వండి.

**చిన్న విజయాలనూ సెలబ్రేట్ చేసుకోండి**

జీవితంలో పెద్ద విజయాల కోసం ఎదురుచూస్తూ చిన్న విజయాలను చాలామంది మర్చిపోతారు. ఒక పని పూర్తి చేశారా? ఒక లక్ష్యానికి దగ్గరయ్యారా? మీరే మిమ్మల్ని అభినందించుకోండి. చిన్న విజయాలే పెద్ద విజయాలకు బలం.

**ఆశించకుండా మంచి చేయండి**

ఇతరులకు సాయం చేయడం మనకూ ఆనందాన్ని ఇస్తుంది. ఒకరికి తోడుగా నిలవడం, పెద్దలను పలకరించడం, అవసరమైన వారికి సాయం చేయడం వంటి చిన్న పనులు కూడా మనసుకు సంతృప్తిని ఇస్తాయి.

**నియంత్రించాలనే ఆలోచన వదిలేయండి**

ప్రపంచంలో ప్రతి విషయం మన చేతిలో ఉండదు. ట్రాఫిక్, ఆర్థిక పరిస్థితులు, ఇతరుల అభిప్రాయాలు.. వీటిని మార్చలేం. 'దీనిపై నేను ఏమైనా చేయగలనా?' అని ఆలోచించండి. చేయగలిగితే చర్య తీసుకోండి. లేకపోతే వదిలేయడం నేర్చుకోండి.

**నిజమైన సంబంధాలకు సమయం**

సోషల్ మీడియా సందేశాల కంటే ముఖాముఖి సంభాషణలు ఎక్కువ ఆనందాన్ని ఇస్తాయి. స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమయం గడపండి. మనల్ని నిజంగా అర్థం చేసుకునేవారు కొంతమందే అయినా, అది వందల పరిచయాల కంటే విలువైన విషయం.

# ముంబైలో వరుణుడి బీభత్సం..

మేయర్ చూస్తుండగానే మ్యాన్‌హోల్‌లో పడిపోయిన కార్మికుడు!

ముంబైని ముంచెత్తిన కుండపోత వర్షం

రుతుపవనాలపై మేయర్ ప్రకటనకు, వాస్తవానికి పొంతన లేని వైనం

మ్యాన్‌హోల్‌లో పడిపోయిన కార్మికుడిని సురక్షితంగా కాపాడిన సిబ్బంది

లోతట్టు ప్రాంతాలు జలమయం, రైళ్ల రాకపోకలకు అంతరాయం

పాలనను సమీక్షించుకోవాలంటూ సొంత పార్టీ నేతల నుంచే సూచనలు



ఆలస్యంగానైనా ముంబైను పలకరించిన రుతుపవనాలు తొలిరోజే నగరాన్ని అతలాకుతలం చేశాయి. రాత్రంతా కురిసిన కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనికితోడు, ముంబైలో రుతుపవనాల కోసం తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని, నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని మేయర్ రితూ తావడే ప్రకటించిన కొద్దిసేపటికే, అది కూడా ఆమె కళ్లెదుటే ఒక కార్మికుడు మ్యాన్‌హోల్‌లో పడిపోవడం పాలనాయంత్రాంగం వైఫల్యాన్ని ఎత్తిచూపింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, పౌర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి అతడిని సురక్షితంగా బయటకు తీయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు కొద్ది నిమిషాల ముందు గాంధీ మార్కెట్ వద్ద మేయర్ రితూ తావడే మాట్లాడుతూ.. నగరంలో పంపులన్నీ పనిచేస్తున్నాయని, రోడ్లు శుభ్రంగా ఉన్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. నాలాల శుభ్రపరిచే పనులు దాదాపు పూర్తయ్యాయని, విమర్శలు చేస్తున్న వారు ఈ రోజు ఇళ్లలో కూర్చున్నారని ఆమె వ్యాఖ్యానించారు. అయితే, ఆమె ప్రకటనకు భిన్నంగా వాస్తవ పరిస్థితి కనిపించింది. సాధారణంగా జూన్ 10న ప్రవేశించాల్సిన రుతుపవనాలు ఈసారి 13 రోజులు ఆలస్యంగా ముంబైకి చేరాయి. రాత్రిపూట కురిసిన భారీ వర్షానికి నగరం గడిచిన 24 గంటల్లో (ఉదయం 8 గంటల వరకు) సగటున 195 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని నమోదు చేసింది. పశ్చిమ శివారు ప్రాంతాల్లో 208 మి.మీ., తూర్పు శివారు ప్రాంతాల్లో 167 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో అంధేరి సబ్‌వే, హిందమాతా, కింగ్స్ సర్కిల్ వంటి ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. ఉదయం వేళ ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల కారణంగా సబర్బన్ రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు.

సెంట్రల్ రైల్వే ట్రాన్స్-హార్బర్ లైన్‌లో తుర్భే, కోపర్‌ఖైరానే స్టేషన్ల మధ్య నీటి ప్రవాహం కారణంగా ట్రాక్ కుంగిపోవడంతో థానే, వాషీ/పన్వేల్ మధ్య సర్వీసులు నిలిచిపోయాయి. ఇదిలా ఉంటే.. పాలకపక్షమైన శివసేనకు చెందిన ఎమ్మెల్సీ మనీషా కయాండే సైతం నగర పాలక సంస్థ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలాలను మరింత సమర్థవంతంగా శుభ్రం చేయాలని, ఎండిన వ్యర్థాలను తొలగించి నీరు నిలిచిపోకుండా చూడాలని సూచించారు. ఇది రాజకీయాలకు సమయం కాదని, ప్రజల సమస్యలను పరిష్కరించడం ముఖ్యమని ఆమె హితవు పలికారు. రానున్న 24 గంటల్లో మరిన్ని వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో సహాయక బృందాలు అప్రమత్తంగా ఉన్నాయి.

# కొత్త ఉద్యోగులతో సీఎం విజయ్.. ఫ్యామిలీకి హాయ్, హార్ట్ సింబల్!


తమిళనాడు: ముఖ్యమంత్రి విజయ్ ఒక అధికారిక కార్యక్రమాన్ని తనదైన శైలిలో ఎంతో ఉత్సాహంగా, చిరస్మరణీయంగా మార్చారు. బుధవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో 'ట్యాంజెడ్‌కో' (విద్యుత్ బోర్డు)కు కొత్తగా ఎంపికైన వారికి ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కొందరు ఉద్యోగులు కోరిన సరదా విన్నపాలను ఆయన మన్నించి అక్కడి వారందరినీ ఆకట్టుకున్నారు. తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రాష్ట్ర విద్యుత్ శాఖకు ఎంపికైన వారికి ముఖ్యమంత్రి



విజయ్ నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో ఒక నూతన ఉద్యోగి తన కుటుంబ సభ్యులకు 'హాయ్' చెప్పాలని కోరగా, విజయ్ చిరునవ్వుతూ కెమెరా వైపు చూసి అభివాదం చేశారు. మరొక అభ్యర్థి 'హార్ట్ సింబల్' చూపించమని కోరగా, ఆయన ఆ విన్నపాన్ని కూడా తీర్చారు. దీంతో సభ ప్రాంగణమంతా చప్పట్లు, కేరింతలతో సందడిగా మారింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం పార్టీ విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించారు.

# బరువు తగ్గాల్సిన అవసరం ఉందా?


## రాత్రి భోజనంలో అలాంటి ఆహారాలు తినండి..













చాలా మందికి బరువు పెరగడానికి ఇబ్బంది ఉండదు. కానీ బరువు తగ్గడం వారికి పెద్ద సమస్య. శరీర ఊబకాయం కారణంగా ఏదైనా సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనడానికి వారు పట్టించుకోవడం లేదు. ఈ సమయంలో, వారు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తారు.

మార్కెట్లో లభించే బరువు తగ్గించే మాత్రలు, ఇతర వైద్యపరమైనవి తినడం ప్రారంభించినప్పుడు, మీరు తాత్కాలికంగా బరువు కోల్పోతారు, దాన్ని ఆపిన వెంటనే బరువు పెరుగుతారు. ఈ సమయంలో ఎటువంటి దుష్ప్రభావాలు లేని ఇంటి నివారణలు చాలా ప్రభావవంతంగా ఉంటాయి.

కొందరు త్వరగా బరువు తగ్గాలనే ఆశతో విందును కూడా దాటవేస్తారు. కానీ ఇది పరోక్షంగా బరువు తగ్గించే ప్రయత్నాలకు భిన్నంగా పనిచేయవచ్చు. ఇలా చేయడం వల్ల రాత్రి మీరు నిద్రపోకుండా చేస్తుంది. దాంతో రాత్రి మేల్కొని ఉండటానికి సహాయపడుతుంది మరియు అనారోగ్యకరమైన, అధిక కేలరీలు ఉన్న ఆహారాలను తినడం పెంచుతుంది.

ఇది మీ అభిరుచిని నాశనం చేయడమే కాదు, మరుసటి రోజు ఉదయం మీకు అలసట మరియు నీరసపరిచే అనుభూతిని కలిగిస్తుంది మరియు రోజు కార్యకలాపాలను నిర్వహించలేకపోతుంది. ఆహారం కూడా హెచ్చుతగ్గులకు లోనవుతుంది. అందువల్ల, బరువు తగ్గడానికి, మీరు బాగా నిద్రపోవాలి మరియు నిద్రించే ముందు మంచి పోషకమైన ఆహారాన్ని తినాలి. రండి, రాత్రిపూట తినగలిగే పది ఆరోగ్యకరమైన **ఆహారాన్ని చూద్దాం ...**

**చెర్రీస్**

ఇవి భోజనం తర్వాత ఆకలిని తీర్చడమే కాక, బాగా నిద్రపోవడానికి కూడా సహాయపడతాయి. చెర్రీస్ లో మెలటోనిన్ అనే పోషకాన్ని కలిగి ఉంటుంది, ఇది నిద్రను నియంత్రించడంలో సహాయపడుతుంది. యాంటీఆక్సిడెంట్లు మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ ఏజెంట్లు దీనిని నివారించడంలో సహాయపడతాయి.

**పెరుగు:** వీలైతే గ్రీకు పెరుగు అయిన పెరుగును తీసుకురండి. ఇంట్లో స్వయంగా తయారుచేసే మోజారెల్లా కూడా మంచిది. రాత్రి భోజనంలో పెరుగు తీసుకోవడం మంచి ప్రోటీన్ మరియు తక్కువ చక్కెరను అంది స్తుంది. ప్రోటీన్ కడుపు నిండినట్లు చేస్తుంది మరియు రాత్రి సమయంలో కండరాలు పెరగడానికి సహాయపడుతుంది. ప్రోటీన్ శరీర కొవ్వును కరిగించి బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

**వేరుశెనగ వెన్న:** బరువు తగ్గడానికి ఉత్తమ ఎంపిక ఏమిటంటే గోధుమ పిండితో తయారు చేసిన రొట్టె ముక్కపై వేరుశెనగ వెన్న లేదా వేరుశెనగ బటర్ పూత పూసి తినడం. పీనట్ బటర్ లో ప్రోటీన్ కండరాలను నిర్మించడానికి మరియు ఆరోగ్యకరమైన కడుపులను పూర్తిగా అనుభూతి చెందడానికి సహాయపడుతుంది.

కాటేజ్ చీజ్ కూడా బరువు తగ్గడానికి రాత్రి పడుకునే ముందు తినడానికి గొప్ప ఆహారం. కేసిన్ ప్రోటీన్ అధిక మొత్తంలో కడుపు నిండుగా ఉంచుతుంది మరియు దెబ్బతిన్న కండరాలను సరిచేయడానికి సహాయపడుతుంది. ఇది కేలరీలను తగ్గిస్తుంది మరియు అవాంఛిత కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది.

టర్కీ మాంసంలో లభించే ట్రిప్టోఫాన్ అనే పోషకం మీకు బాగా నిద్రించడానికి సహాయపడుతుంది మరియు రాత్రి బరువు తగ్గించేవారికి మంచి ఎంపిక. దీనిలోని ప్రోటీన్ కండరాలను నిర్మించడంలో సహాయపడుతుంది మరియు కొవ్వును కరిగించడం ద్వారా బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. టర్కీని శాండ్‌విచ్ రూపంలో తినడం మంచిది.

**చాక్లెట్ మిల్క్:**కొవ్వును కరిగించడానికి చాక్లెట్ బ్లెండెడ్ పాలు కూడా చాలా బాగుంటుంది. పాలలో కాల్షియం బొడ్డు కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం 1000 మిల్లీగ్రాముల కాల్షియం తీసుకోవడం వల్ల 18 పౌండ్ల కొవ్వు కరిగిపోతుంది. పాలలో విటమిన్ డి కాల్షియం గ్రహించడానికి సహాయపడుతుంది.

**బాదం:** ఇందులో ఐదు గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది దెబ్బతిన్న కండరాలను రాత్రి పూట రిపేర్ చేయగలదు. బాదంపప్పులో కరిగే ఫైబర్ కడుపు నిండినట్లు చేస్తుంది మరియు ఎక్కువగా తినకుండా నిరోధిస్తుంది. కొవ్వును కరిగించడానికి బాదం గొప్ప ఆహారం.

**అధిక ఫైబర్ ఆహారాలు**

అధిక మొత్తంలో కరగని ఫైబర్ ఉన్న ఆహారాన్ని రాత్రి తరచుగా తినాలి. అధిక ఫైబర్ తృణ ధాన్యాలు మంచి ఎంపిక. కరగని ఫైబర్ తీసుకోవడం కొవ్వును కరిగించడానికి మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుందని ఒక అధ్యయనం కనుగొంది.

గ్రీన్‌టీ వల్ల అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యం, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రాత్రి భోజనం తర్వాత ఒక కప్పు గ్రీన్ టీ తీసుకోవడం ద్వారా, మీరు బరువు పెరగవచ్చు, అదే సమయంలో ఈ ప్రయోజనాలను కూడా పొందవచ్చు. గ్రీన్ టీలోని కొన్ని పోషకాలు ముఖ్యంగా రాత్రి సమయంలో ఎక్కువ కొవ్వును కరిగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.

గుడ్లలో ప్రోటీన్ మరియు ఇతర పోషకాలు అధికంగా ఉంటాయి మరియు రాత్రి భోజనంలో చేర్చడానికి మంచి ఎంపిక. ఒక పెద్ద గుడ్డు డెబ్బై ఎనిమిది కేలరీలను కలిగి ఉంటుంది మరియు ఇతర పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి ఈ వ్యాసం మీకు ఉపయోగకరంగా ఉందని మీరు భావిస్తే, మీ స్నేహితులతో పంచుకోండి.









# ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం..

-స్వయంగా లేఖ రాసిన ఇరాన్ అధ్యక్షుడు!


-ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఇరాన్ ఆహ్వానం!

-అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసిన వైనం

-జులై 4 నుంచి అంత్యక్రియల కార్యక్రమాలు

-జులై 9న మష్హాద్‌లో ఖననం

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని మోదీని ఇరాన్ ఆహ్వానించినట్లు సమాచారం. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. మరి దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్ ఇప్పటివరకు ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల విషయంలో శాంతి, చర్చల ద్వారానే పరిష్కారం కావాలని తన వైఖరిని కొనసాగిస్తోంది. ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న ప్రారంభం కానున్నాయి. పలు దశల్లో జరిగే నివాళి కార్యక్రమాల అనంతరం జులై 9న ఆయన స్వస్థలమైన మష్హాద్‌లో ఖననం చేయనున్నారు. తెహ్రాన్, ఖోమ్ నగరాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో జరిగిన అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీ మరణించినట్లు ఇరాన్ ప్రకటించింది. దాదాపు 36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌కు సుప్రీం లీడర్‌గా సేవలందించారు. అంత్యక్రియలకు కోట్ల సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తరపున కూడా ప్రతినిధి బృందం హాజరుకానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇరాన్ అధ్యక్షుడు తనను కూడా ఆహ్వానించారని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు.



# ‘మేమిద్దరం ప్రైవేటుగా మాట్లాడుకున్నాం’..

సీఎం విజయ్ బర్త్‌డే విషెస్ వివాదంపై రజనీ క్లారిటీ!

తామిద్దరం వ్యక్తిగతంగా మాట్లాడుకున్నామని, ఫోన్‌లో విషెస్ చెప్పానని వెల్లడి

‘ధర్మన్’ సినిమా ప్రారంభోత్సవంలో మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చిన తలైవా

విజయ్ రాజకీయ ఎదుగుదల నేపథ్యంలో రజనీకాంత్‌పై పెరుగుతున్న ఒత్తిడి





సూపర్‌స్టార్ రజనీకాంత్, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మధ్య సంబంధాలపై కొంతకాలంగా జరుగుతున్న చర్చకు తాజాగా ఆయన స్వయంగా తెరదించారు. విజయ్ పుట్టినరోజున బహిరంగంగా శుభాకాంక్షలు చెప్పకపోవడంపై సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలకు రజనీ క్లారిటీ ఇచ్చారు. తామిద్దరం వ్యక్తిగతంగా మాట్లాడుకున్నామని, అనవసరమైన ఊహాగానాలకు తావులేదని స్పష్టం చేశారు. ఇవాళ తన తదుపరి చిత్రం ‘ధర్మన్’ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రజనీకాంత్ పాల్గొన్నారు. ఈవెంట్ ముగిశాక ఆయన వెళ్తుండగా, మీడియా ప్రతినిధులు సీఎం విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. దీనికి రజనీ స్పందిస్తూ.. ‘మేమిద్దరం అప్పుడే మాట్లాడుకున్నాం’ అని తమిళంలో క్లుప్తంగా సమాధానమిచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో ఈ వివాదానికి ఆయన ముగింపు పలికినట్లయింది. నిన్న తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన 52వ పుట్టిన రోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కమల్ హాసన్, మోహన్‌లాల్, కీర్తి సురేష్, ఖుష్బూ సుందర్, త్రిష వంటి రాజకీయ, సినీ రంగాలకు చెందిన అనేక మంది ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అయితే, రజనీకాంత్ నుంచి ఎలాంటి బహిరంగ ప్రకటన రాకపోవడంతో ఆయన అభిమానులు, నెటిజన్ల మధ్య తీవ్ర చర్చ జరిగింది. నిజానికి రజనీకాంత్ ఇలాంటి విమర్శలను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది మొదట్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి, ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలోనూ రజనీ మౌనంపై ప్రశ్నలు తలెత్తాయి. వాస్తవానికి ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే విజయ్‌కు అభినందనలు తెలిపిన మొదటి వ్యక్తులలో రజనీ ఒకరు. అయినప్పటికీ బహిరంగంగా స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. ఇటీవలి కాలంలో తమిళనాట రజనీకాంత్, విజయ్ మధ్య పోలికలు పెరిగాయి. రజనీ రాజకీయ ప్రవేశంపై వెనక్కి తగ్గగా, విజయ్ మాత్రం అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ తీసుకునే ప్రతి నిర్ణయం, ఆయన మౌనం కూడా విజయ్‌తో ముడిపెట్టి విశ్లేషణలకు దారితీస్తోంది.

# సినిమా న్యూస్



అందమైన గులాబి రంగు చీరలో బంధవి శ్రీధర్ మెరిసిపోతున్నారు. గ్లామర్, అంకితభావం మరియు ప్రతిభ కలగలిసిన బంధవి శ్రీధర్, దక్షిణాది చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని వేగంగా ఏర్పరచుకుంటున్నారు.

## విజయ్‌తో సోలో మూవీ.. నాగీ అసలు ప్లాన్ అదేనా..





టాలీవుడ్ లో కొన్ని కాంబినేషన్లకు స్పెషల్ క్రేజ్ ఉంటుంది. అలాంటి జోడీల్లో దర్శకుడు నాగ్ అశ్విన్, హీరో విజయ్ దేవరకొండ కూడా ఒకటి. ఇప్పటివరకు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ప్రతి ప్రాజెక్టులో ఏదో ఒక రూపంలో విజయ్ కనిపించడం అభిమానులను ఆకట్టుకుంది. అయితే ఫ్యూచర్ లో సోలో సినిమా కోసం నాగ్ అశ్విన్ ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారేమో అనే చర్చ మొదలైంది. తాజాగా సింగ్ గీతం ప్రమోషన్స్ సందర్భంగా నాగ్ అశ్విన్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విజయ్ దేవరకొండతో కచ్చితంగా ఒక ఫుల్ ఫ్లెడ్జ్ సినిమా చేయాలని ఉందని ఆయన క్లారిటీ ఇచ్చారు. విజయ్‌ను విభిన్న పాత్రల్లో చూపించడం తనకు చాలా కంఫర్ట్ గా అనిపిస్తుందని, ఇప్పటివరకు తాను చేసిన నాలుగు సినిమాల్లోనూ విజయ్ ను కొత్త యాంగిల్ లోనే చూపించానని చెప్పారు. ఇప్పుడు సోల్ మూవీ చేసేందుకు మంచి సమయం కోసం ఇద్దరూ ఎదురుచూస్తున్నామని వెల్లడించారు. కపూర్ త్రీరోజెస్ సందడే సందడి ఆ కామెంట్స్ తోనే అభిమానుల్లో కొత్త చర్చ మొదలైంది. ఇప్పటివరకు కామియోలు మాత్రమే చేసిన విజయ్.. ఇక నాగీ దర్శకత్వంలో పూర్తి స్థాయి హీరోగా కనిపించేందుకు రెడీ అయ్యారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విభిన్న కథలను తెరకెక్కించడంలో నాగ్ అశ్విన్‌కు ఉన్న టాలెంట్, ప్రయోగాత్మక పాత్రలను చేయడంలో విజయ్‌కు ఉన్న ఆసక్తి చూస్తే ఆ కాంబోపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. నిజానికి నాగ్ అశ్విన్, విజయ్ దేవరకొండ జర్నీ చాలా కాలం క్రితమే ప్రారంభమైంది. దర్శకుడిగా నాగ్ అశ్విన్ తొలి చిత్రం ఎవడే సుబ్రహ్మణ్యంలో విజయ్ కీలక పాత్ర పోషించారు. ఆ సినిమాతో నటుడిగా ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. ఆ తర్వాత మహానటిలో మరో భిన్నమైన పాత్రలో కనిపించారు. ఇక కల్కి 2898 ఏడీ'లో విజయ్ దేవరకొండ చేసిన ప్రత్యేక పాత్ర ప్రేక్షకులకు సర్ప్రైజ్ గా నిలిచింది. రీసెంట్ గా సింగ్ గీతం మూవీలో కూడా కనిపించారు. దీంతో నాగ్ అశ్విన్ సినిమాల్లో విజయ్ కనిపించడం ఒక రకంగా అభిమానులకు అలవాటైపోయింది. ప్రతి సినిమాలో ఆయన కోసం ఏదో ఒక ప్రత్యేక పాత్ర సిద్ధంగా ఉంటుందనే అభిప్రాయం కూడా ఏర్పడింది. అదే సమయంలో నాగ్ అశ్విన్ తన సినిమాల్లో పాత్రలను చాలా జాగ్రత్తగా డిజైన్ చేస్తారు. హీరో ఇమేజ్ కంటే పాత్రకు ఇంపార్టెన్స్ ఇస్తారు. అలాంటి దర్శకుడి చేతుల్లో విజయ్ దేవరకొండ లాంటి నటుడు పడితే పూర్తిగా కొత్త తరహా పాత్ర ప్రేక్షకులకు కనిపించే అవకాశం ఉంది. మరోవైపు విజయ్ కూడా కెరీర్ లో కొత్త తరహా కథలు, విభిన్న పాత్రల కోసం ప్రయత్నిస్తున్న సమయం ఇది. దీంతో నాగ్ అశ్విన్ ఆలోచన, విజయ్ ఆసక్తి ఒకే దారిలో ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టుపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినా, నాగ్ అశ్విన్ తాజా కామంట్స్ మాత్రం అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించాయి. ఇప్పటివరకు చిన్న చిన్న పాత్రలతో సాగిన ఆ ఫ్రెండ్ షిప్.. త్వరలోనే సోలో సినిమాగా మారుతుందా? విజయ్ కోసం నాగ్ అశ్విన్ ప్రత్యేక కథ సిద్ధం చేస్తున్నారా? అనే ప్రశ్నలకు సమాధానం రావాలంటే ఇంకొంతకాలం వేచి చూడాల్సిందే.

## హీరోయిన్లతో సేఫ్ గేమ్ ఆడుతోన్న అనీల్!

టాలీవుడ్‌లో కమర్షియల్ సక్సెస్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకులలో అనిల్ రావిపూడి టాప్ లో ఉన్నారు. తన మార్కు కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రేక్షకులను అలరించే సినిమాల నిర్మాణంలో ప్రతి విషయంలోనూ పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తుంటారు. ముఖ్యంగా హీరోయిన్ల ఎంపిక విషయంలో అనిల్ రావిపూడి ప్రత్యేకమైన వ్యూహాన్ని అనుసరిస్తారనే టాక్ ఇండస్ట్రీలో ఉంది. హీరోయిన్ల పరంగా ప్రయోగాలకు పోకుండా క్రేజ్ ఉన్న నాయికలతోనే సేఫ్ గేమ్ ఆడుతున్నారనే చర్చ నడుస్తోంది. సాధారణం చాలా మంది దర్శకులు కొత్త టాలెంట్‌ను పరిచయం చేయడానికి ఆసక్తి చూపిస్తుంటారు. కానీ అనిల్ రావిపూడి మాత్రం కెరీర్‌లో ఇప్పటి వరకు పూర్తి స్థాయి కొత్త హీరోయిన్లను కథానాయికలుగా పరిచయం చేసిన సందర్భాలు లేవు. విజయంలో హీరోయిన్ పాత్ర కూడా కీలకమే కాబట్టి నటన .. స్క్రీన్ ప్రెజెన్స్ పరంగా ఎలాంటి రిస్క్ తీసుకోకూడదనేది ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తుంది. అందుకే ఇండస్ట్రీలో కనీస ఇమేజ్ ఉన్న ముఖాలనే అనీల్ ప్రాజెక్ట్‌ల కోసం పరిశీలిస్తుంటారు. హీరోయిన్ పాత్రలు గ్లామర్‌కే పరిమితం కాకుండా లౌడ్ కామెడీ .. విలక్షణమైన మేనరిజమ్స్‌తో కూడి ఉంటాయి. –ఎఫ్ 2– లో తమన్నా, మెహ్రీన్ పాత్రలు గానీ, –సరిలేరు నీకెవ్వరులో రష్మిక మందన్న మేనరిజం గానీ,



–భగవంత్ కేసరిలో శ్రీలీల పాత్ర గానీ,– సంక్రాంతి వస్తున్నాం–లో ఐశ్వర్యా రాజేష్ పాత్రలు ఇందుకు ఉదాహరణలు. ఇలాంటి పాత్ర పండించాలంటే కెమెరా ముందు అనుభవం ఉండి, ప్రేక్షకులలో ఒక రకమైన ఇమేజ్ ఉన్న హీరోయిన్లు అయితేనే న్యాయం చేయగలరని అనీల్ నమ్ముతుంటారు. పాత్ర స్వభావాన్ని బట్టి, ఆ బరువును మోయగల నాయికలనే ఎంచుకుంటారు. కొత్త హీరోయిన్లను తీసుకున్నప్పుడు బాడీ లాంగ్వేజ్, టైమింగ్‌ను మార్చుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఒక్కోసారి ఆ ప్రయోగాలు వికటించి సినిమా ఫలితంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇలాంటి రిస్క్‌ల నుంచి అనిల్ సులువుగా ఎస్కేప్ అవుతుంటారు. స్టార్ ... సెమీ–స్టార్ హీరోయిన్లను తీసుకోవడం వల్ల సినిమా బిజినెస్‌కు, ప్రమోషన్లకు కూడా అదనపు మైలేజ్ లభిస్తుంది. ఈ రకమైన సేఫ్ స్ట్రాటజీ దర్శకుడిగా అనీల్ పై ఉండే ఒత్తిడిని చాలా వరకు తగ్గిస్తుంది. అనిల్ రావిపూడి అనుసరిస్తున్న ఈ పద్ధతి కమర్షియల్‌గా ఎంతో సేఫ్ అండ్ సక్సెస్‌ఫుల్ మోడల్. ఒక భారీ కమర్షియల్ సినిమాను రూపొందిస్తున్నప్పుడు ప్రతీ ఎలిమెంట్ పక్కాగా ఉండాలి. హీరోయిన్ల విషయంలో క్రేజ్ ఉన్న వారిని సెట్ చేయడం వల్ల ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడం సులువవుతుంది. కొత్తవారితో ప్రయోగాలు చేసి చేతులు కాల్చుకోవడం కంటే నిరూపితమైన నాయికలతో ముందుకు వెళ్లడమే ఉత్తమమనేది అనీల్ బిజినెస్ మైండ్ సెట్‌ను సూచిస్తుంది. ఏదేమైనా? వరుస విజయాలతో దూసుకుపోతున్న అనిల్ రావిపూడి రాబోయే చిత్రాల్లోనూ ఇదే తరహా ధోరణిని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వెంకటేష్–కల్యాణ్ రామ్ తో చేస్తోన్న ప్రాజెక్టులలో క్రేజీ హీరోయిన్లే ఉన్నారు. కీర్తి సురేష్, కృతిశెట్టి లాంటి అందమైన హుషారైన భామల్ని ఎంపిక చేసి మరోసారి ట్యాలెంట్ ప్రూవ్ చేసుకున్నారు.

## 'వారణాసి' సెట్స్ పై ఎంఎంఏ ఫైటర్‌తో రాజమౌళి..

### 'వారణాసి' పేరుతో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం

### సెట్స్ నుంచి వీరిద్దరి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్ లో వస్తున్న వరల్డ్ అడ్వెంచర్ యాక్షన్ మూవీ వారణాసి. తాజాగా ఈ సినిమా గురించి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా సెట్స్ నుంచి కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఫొటోలలో రాజమౌళి పక్కన 6.5 అడుగులకు పైగా ఎత్తుతో ఉన్న ఓ భారీ కాయుడు కనిపించడం అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. అతడి కంటే ఎత్తుగా కనిపించేందుకు సరదగా రాజమౌళి కుర్చీ ఎక్కి నిలబడడం ఈ ఫొటోల్లో చూడొచ్చు. ఇంతకీ ఆ ఫొటోల్లో జక్కన్నతో ఉన్న వ్యక్తి మరెవరో కాదు, భారత్‌కు చెందిన ప్రొఫెషనల్ ఎంఎంఏ (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్) ఫైటర్ యోగేశ్ జాదవ్. క్రీడా వర్గాల్లో 'ది జెంటిల్ జెయింట్'గా పేరుపొందిన యోగేశ్, బిగ్ బాస్ మరాఠీ వంటి రియాలిటీ షోల ద్వారా కూడా సుపరిచితుడే. మహేశ్ బాబుతో తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్–అడ్వెంచర్ చిత్రంలో కీలకమైన యాక్షన్ సన్నివేశాల కోసం రాజమౌళి అతడిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. 'వారణాసి' సినిమా కోసం కాశీ నగరాన్ని తలపించేలా భారీ సెట్స్‌ను నిర్మించారు. ఈ సెట్స్‌లోనే రాజమౌళి, యోగేశ్ జాదవ్‌తో చర్చిస్తున్న ఫోటోలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. సినిమాలో అత్యంత శక్తివంతమైన, హై–ఆక్టేన్ ఫైట్ సన్నివేశాలను డిజైన్ చేయడంలో యోగేశ్ పాలుపంచుకుంటున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ నాటికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.



## ఈ రోజుల్లో మాట్లాడాలంటేనే భయం: రజనీకాంత్



సూపర్‌స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ కలయికలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం టైటిల్‌ను బుధవారం చెన్నైలో అధికారికంగా ప్రకటించారు. రజనీకాంత్ 173వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'ధర్మన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ, వర్తమాన పరిస్థితుల్లో బహిరంగంగా మాట్లాడాలంటేనే భయమేస్తోందని, తన మాటలను నిరంతరం తప్పుగా అర్థం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇటీవలి కాలంలో వేదికలపై మాట్లాడాలంటేనే సంకోచించాల్సిన పరిస్థితి నెలకొంది. నేను మాట్లాడితే అదో ఒక సమస్యగా మారుతోంది. మౌనంగా ఉంటే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ మాట్లాడితే, ఈ సమయంలో ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని అడుగుతున్నారు. అసలు ఏమీ మాట్లాడొద్దని మరికొందరు సలహాలిస్తున్నారు. ఇవన్నీ గమనించిన తర్వాత నాకు ఒక విషయం అర్థమైంది. మనల్ని ఇష్టపడని వారికి మనం ఏం చేసినా నచ్చదు" అని రజనీకాంత్ పేర్కొన్నారు. కమల్ హాసన్ మాట్లాడుతూ, "మేమిద్దరం ఏవీఎం స్టూడియోలోని ఒక వేప చెట్టు కింద కూర్చుని పెద్ద కలలు కన్నాం. నేడు ఈ స్థాయిలో ఇక్కడ ఉన్నాం. ఈ సినిమా పట్ల రజనీకాంత్ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662